# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 38 సంచిక 7

పేజీలు 44

మార్చి 2019

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


భద్రవాక్యం ........................................4

శ్రీబాబూజీ ఉవాచ........................................ 5

అమ్మమాట........................................ 7

శ్రీబాబు బృందావన ధామము-
శ్రీ స్వామినారాయణ్
అక్షరధామము ................................9

ధనుర్మాస వైభవము ................................11

అస్ఖలిత బ్రహ్మచారి - నిత్యోపవాసి .......13

నామ మహిమ ........................................14

సప్తసప్తాహాల సత్సంగ సమావేశాల - విజ్ఞప్తి 17

ఆధ్యాత్మికంలో హాస్యకథలు .........................18

న్యాయమైన సంపాదనకే గౌరవం .......20

గుడగూచి ........................................22

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.............................24

శ్రీకృష్ణ కర్ణామృతము ..........................................25

పరిప్రశ్న ........................................ 26

పరిపూర్ణ జ్ఞానం ... ........................................28

నేను - తాను ........................................31

యాజమాన్యం తదితర వివరాలు...........34

కైవల్యోపనిషత్ ... ........................................35

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....37

శ్రీబాబూజీ స్కూల్ విశేషాలు. ..................39

విష్ణు కథలు ...... ............................ ...................41

# భద్ర వాక్యం

- పరాశర ప్రసాద్

## అమృతబిన్దూపనిషద్

**6. నైవ చిన్త్యం నచా చిన్త్యం, న చిన్త్యం చిన్త్యమేవ తత్।**
**పక్షపాత వినిర్ముక్తం బ్రహ్మసమ్పద్యతే తథా ॥**

చింతన, విచారణ అనేవి మనస్సు యొక్క క్రియా స్వరూపమే సుమా! మానవుని జీవితంలో విచారణకు ప్రధానమైన అంశాలు రెండు మాత్రమే. మనస్సు యొక్క స్వాభావికం ప్రాపంచిక వ్యవహారాలలో, విషయాదులలో తలమునకలై వుండటము. అదే బాహ్య దృష్టి. దాని ద్వారా దేహ భావన పెంపొంది, నేను నాది అనేవి దృఢతరమవ్వటం తథ్యం. అటువంటి విషయాసక్తిగల మనస్సు పరమపదము గురించిగాని, ఆత్మసంబంధిత విచారణగాని చేయడానికి ఉపక్రమించదు. ఆత్మవిచారణనే లోదృష్టి, లేక అంతర దృష్టి అని అనవచ్చు. చింతన, లేక విచారణ అనేది ఏదో ఒక పరిమిత కాలానికి చేసేది ఎన్నడూ కాదు. అది నిరంతరం కొనసాగించ వలసినదే. ఎంతవరకు చింతన చేయాలన్న ప్రశ్నకు గమ్యం చేరేవరకు అని సమాధానం చెప్పవచ్చు. ఆత్మభావం పొంది, బ్రహ్మపదము చేరి, ఇంక విషయాసక్తి అనేది నశించే వరకు విచారణ కొనసాగవలసినదే.

బాహ్య దృష్టి వున్నంతవరకూ మనస్సు విషయాదులతో కూడి పెక్కు సమస్యలతో సతమతమవుతూ శాంతికి దూరమవుతాడు. విషయాసక్తుడైన సాధకుడు పరమ పదాన్ని గూర్చి ఎన్నడూ చింతించడు. అంతేకాదు ప్రాపంచికంగా మానవుడి పొందే ఎన్నో సౌకర్యాలను ఎందుకు తృణీకరించాలి? తాను పొందే ప్రాపంచిక ఆనందాన్ని ఓర్వలేక, ప్రాపంచిక విషయాదులను గురించి దుష్ప్రచారం చేస్తున్నారనే వాదన కూడా తీసుకువస్తారు. ఇవన్నీ మానవుడు అజ్ఞానానికి నిదర్శనం. పరమపదం అని వచించినా, బ్రహ్మపదం అని పేర్కొన్నా అది కేవలం సాధకుని మనస్సు సాధన ద్వారా అధిరోహించవలసిన ధామమేగాని, అది ఏదో ఒక ప్రత్యేకమైన స్థానమని ఊహించరాదు. అందువల్ల సాధకుడు మనస్సుని అంతర్ముఖం చేసి, ఆత్మపరంగా విచారణ చేస్తే తప్పక అది మంగళకర కార్యం అయి అప్పుడు తాను ఇంతకాలం నుంచి కోల్పోయిన ఆనందం ఏమిటో గ్రహించగలుగుతాడు. అది సద్గురుమూర్తి మార్గదర్శకత్వంలోనే సాధ్యపడుతుంది.

# శ్రీబాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

27.1.80

ఈరోజు శ్రీ రాఘవాశ్రమము పై అంతస్థు ప్రారంభోత్సవానంతరం రామాలయంలో శ్రీ బాబూజీ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు.

"కీర్తిశేషులు శ్రీ రాఘవరావు గారు ఎంతో భక్తులు. శ్రీ రాఘవరావు దంపతులు ఎంతో పవిత్రమైన ఉద్దేశ్యంతో తమ జీవితాలను సద్గురు చరణారవింద సన్నిధిలో ధన్యం చేసుకోవాలనే నిశ్చయంతో ఆశ్రమం ప్రారంభం అయినపుడే ఆశ్రమవాసులయ్యారు.



అప్పటినుంచి శ్రీ రాఘవరావు దంపతులు పరమపదాన్ని చేరుకొనే వరకూ ఆశ్రమంలోనే ఉన్నారు. బంధుమిత్రుల విమర్శలను లెక్కచేయ లేదు. ఇతర కార్యావసరాలను లెక్కచేయక వారి జీవితాల్ని ఆశ్రమంలోనే గడిపి పునీతం చేసుకున్నారు.

మనమంతా ఆశ్రమ నిర్మాణాభివృద్ధి కార్యక్రమాలలో ఇతోధిక ఉత్సాహంతో, భక్తిశ్రద్ధలతో పూనుకొన్నట్లయితే అతి త్వరలోనే ఇది అత్యుత్తమ ఆధ్యాత్మిక కేంద్రంగా వెలసి మానవకోటి సేవకు అంకితం కాగలదు. ఇప్పుడు మన ఆశ్రమంలో శ్రీ రామచంద్ర ప్రభువు, జగన్మాత జానకీదేవి, లక్ష్మణ, హనుమ సమేతులై వేంచేసి భక్తులందరికి దివ్యదర్శనం అనుగ్రహించి తరింపచేస్తున్నారు. త్వరలోనే రాధాకృష్ణుల దివ్యమూర్తులు కూడా రెండవ ఆలయంలోనికి వేంచేసి మనకు కన్నుల పండుగ చేస్తారు. భగవానుడు లక్ష్మీనారాయణుడే త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడిగా, ద్వాపరయుగంలో శ్రీకృష్ణ పరమాత్మగా అవతరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేశాడు.

అలాగే మన ఆశ్రమంలో ముందుగా శ్రీ రామచంద్రుడు, అనంతరం రాధాకృష్ణులు వస్తున్నారు. రాముడు, కృష్ణుడు ఒకటే. అంతా నారాయణ స్వరూపమే గాని భేదంలేదు. రామకృష్ణులిరువురూ వెలసిన ఈ పవిత్ర దేవాలయం ఎల్లప్పుడూ గోవింద నామంతో మారుమ్రోగుతూ, ఇలాగే భక్తులతో కిటకిటలాడుతూ, భక్త హృదయాలలో జ్ఞానకిరణాలు వెదజల్లుతూ వర్ధిల్లాలి" అన్నారు శ్రీ బాబు.

"ఇక నారాయణుని హృదయనివాసి పరమేశ్వరుడు. శివుని హృదయ నివాసి నారాయణుడు. శివనారాయణులు బావా, బావమరదులు. వారిరువురు ఒకరిని విడిచి ఒకరు ఉండలేరు కదా!

మీ ఆశ్రమంలో మా బావగారిని ఆహ్వానించి ఊరుకుంటే నన్ను ఆయనకు ఎడం చేసినట్లే కదా. ఇది అన్యాయం. ఇద్దరం ఒకచోటనే వుండాలని పరమేశ్వరుడు కూడ మన ఆశ్రమానికి విచ్చేస్తున్నాడు" అన్నారు శ్రీ బాబు.

ఆయన అర్ధ శరీరమే జగన్మాత కనుక, పరమేశ్వరునితో జగన్మాత కూడ మన ఆశ్రమానికి విచ్చేస్తుంది. నాకు ఒక ఉద్దేశ్యం వుంది. జగన్మాత ఆలయ నిర్మాణ బాధ్యత జగన్మాతరూపిణులైన స్త్రీలు తీసుకోవాలి.

ఆశ్రమంలో ఉన్న స్త్రీలంతా ఎంతో పొదుపుచేసి, ఆ ద్రవ్యాన్ని ఈ పుణ్యకార్యానికి వినియోగించాలి. వారి ద్రవ్యం వినియోగించటమే కాక, ఈ పుణ్యకార్యము గురించి వారి మిత్రులకు, బంధువులకు చెప్పి ప్రోత్సాహ పరచాలి" అన్నారు శ్రీ బాబు.

"ఒక్కొక్కరు ఒక్క రాయి ఇచ్చినా చాలు. అమ్మ దేవాలయం అయిపోతుంది. అలాగే పరమేశ్వరుని ఆలయ నిర్మాణం పురుషులంతా పూనుకొని చెయ్యాలి. ఎవరు ముందుగా పని ప్రారంభిస్తారో, జగన్మాత ముందు వస్తుందో, పరమేశ్వరుడే ముందు వస్తారో చూద్దాం. ఒకరితో ఒకరు పోటీపడి ఎవరు ముందు వస్తారో వారికే ఫస్టు ప్రైజ్. ఒక సినిమాకు వెళ్ళే డబ్బు, లేక ఒకసారి హొటల్‌కి వెళ్ళే ఖర్చు, లేదా సిగరెట్‌ల ఖర్చు మానుకొని, దీనికి వినియోగించారు అనుకోండి. వారు ఎంత ధనమిస్తారో, అంతకు కొన్ని రెట్లు ధనం భగవంతుడు వారికి లభింపచేస్తాడు"అన్నారు.

-సశేషం

(గత సంచిక తరువాయి) # అమ్మమాట - జపమాల ప్రసాద

## వేదాంత వీధుల్లో విహరించు గిరిధారి

"**మనం ఇప్పటి వరకూ వేదాంత వీధుల్లో విహరించు గిరిధారి**' అని పాడుకున్నాము. మరొక ప్రక్క నుండి '**హృదయ సింహాసనాధీశుండె బాబు**' అని అంటున్నాము. మన హృదయబాబు వేదాంత వీధుల్లో విహరిస్తూ వుంటాడా? భక్తుల హృదయంలో విహరిస్తుంటాడా? ఎవరి హృదయంలో భగవంతుడు విహరిస్తూ వుంటాడు? ఎవరి హృదయం వేదాంత వీధి అయిపోతుందో అందులో విహరిస్తాడాయన. అలాగని ప్రపంచంలోని చదువులన్నీ చదివేసిన వారి హృదయమా? అంటే కానేకాదు. ఎవరి హృదయమైతే వేదాంత సారము, రస స్వరూపము అయిన భగవత్తత్వంతో నిండి పోయి వుంటుందో అటువంటి హృదయంలో భగవంతుడు స్వేచ్ఛగా విహరిస్తుంటాడు. గుహుడు, శబరి, మీరా, సక్కూ, కబీర్‌దాస్, ఇత్యాది భక్తులు ఆ కోవకి చెందినవారు.



పరిణామంతో కూడుకుని వున్న యీ ప్రపంచంలోనే వుండి కూడా, వారు మార్పులేని, స్థిరుడైన భగవంతుని యందే తమ మనస్సులను నిలబెట్టారు. తద్వారా వారు కూడా పరిణామ రహితమైన, శాశ్వత స్థితికి చేరుకున్నారు.

జగత్తులో ఏదీ స్థిరం కాదు. అసలు 'జగత్తు' అంటేనే జనించి, గతించేదని అర్థం. కానీ యీ అశాశ్వతమైన జగం లోనే 'త్' - అంటే 'తత్' వస్తువు దాగివుండి, దానిని ప్రకాశింపజేస్తోంది. ఈ సత్యం మనకి తెలియాలంటే కేవలం గురు లక్ష్యార్థ సాధన వలన మాత్రమే సాధ్యం. అర్థం చేసుకుంటే వేదాంతమంత సులభమైనది ఏదీ లేదు. సాధన యొక్క తీవ్రతను బట్టి సాధకులలో మార్పు వస్తుంది. కొంతమంది జిజ్ఞాసువులు త్వరగా తెలుసుకుంటారు. మంద బుద్ధులు, అలసులు, వెనక వుంటారు. ఎవరైనా కానీ, గురుముద్ర పడనిదే మాత్రం అది తెలుసుకోవడం అసంభవం - ఇది శ్రీగురుదేవుల మాట.

సాధన అనేది చెప్పిరాదు. అది పుస్తకాలలో వుండదు. అది నీ

ప్రవర్తనలో వుంటుంది. ఎవరి సాధన వారివారి ప్రవర్తనలోనే ప్రతిబింబిస్తూ వుంటుంది. వారు సాధన ఎలా చేస్తున్నారని వేరేవారెవరో చెప్పవలసిన పని లేదు. 'సాధన ఎలా చేస్తున్నామమ్మా?' అని కొంతమంది అడుగుతూ వుంటారు. అది ఇంకొకరిని అడగవలసిన పనిలేదే! ఎవరి సాధన వారికి తెలుస్తుంది.

జపమాలతో జపం చేస్తూ కొలికి పూస ఎప్పుడు వస్తుందా? అని చూస్తూ లెక్కలు కడుతున్నావా? నీవాళ్ళకొకలాగ, పరాయివాళ్ళకొక లాగా పెడుతున్నావా? ధ్యానమందు నా మనస్సు ఎంతవరకు నిలబడుతోంది? 24గంటలలో ఎన్ని గంటలు సాధన చేస్తున్నాను? ఎన్ని గంటలు ప్రపంచ విషయాలకిస్తున్నాను? - ఇటువంటి ప్రశ్నలన్నింటికి సమాధానం నీ దగ్గరే దొరుకుతుందేమో?

జపం ఎన్ని వేలు, ఎన్ని లక్షలు చేశారన్నది ముఖ్యం కానేకాదు. అగణిత గుణగణుడైన భగవంతుని లెక్కల్లో ఎలా బంధించగలం? నీ భావన నీవు జపిస్తున్న నామమందుగాని, మంత్రమునందు గాని, నిలిచి పోయినప్పుడు కొలికిపూస దానంతట అదే ఆగిపోతుంది. పెదవులు కదలవు. మనస్సు ఆగిపోతుంది. అట్టిది కదా నిజమైన జపం అంటే! హృదయ పవిత్రత వున్న చోట, విచారణ అనే భాండారం వున్న చోట విహరిస్తాడా గిరిధారి!

ధ్యానం చేసేటప్పుడు కొద్దిసేపు ప్రణవాన్ని పూరించాలని చెప్పారు శ్రీగురుదేవులు. ఓంకారం నాభి స్థానం నుండి బయలుదేరి ఊర్ధ్వ ముఖంగా పయనించి, తిరిగి నాభిస్థానానికి చేరుకోవాలి. ధ్యేయ వస్తువు నందే మనస్సు నుంచి ధ్యానం చేయాలి. 'నేను' ఎవరు అనే విచారణ చేయాలి. ఈ చేయి నేనా? ఈ కాలు నేనా? ఈ మనస్సు నేనా? వీటన్నింటినీ 'నావి' అంటున్న ఆ 'నేను' ఎవరు? ఈ పేరు నేనా? కాదు. ఈ అవయవాలన్నీ కలిగిన దేహం నేనా? కానేకాదు. మరి 'నేను' ఎవరు?

'నేను' అంటే 'అహమ్' - అది కేవలం పరమాత్మ స్వరూపం. అది మార్పు లేనటువంటిది. రూప, నామ, క్రియారహితమైన ఒక అనంత శక్తి అది. నామ రూపాత్మకమైన జగత్తులో వున్న మనకి నామరూపాలు బాగా జీర్ణించుకుపోయి వున్నాయి కనుక, ఆ అనంత శక్తి స్వరూపం ఒక రూప, నామాలతో మన ముందుకి వస్తోంది. దానినే భగవంతుడని, పరమాత్ముడని అనేక పేర్లతో పిలుస్తున్నాము. - సశేషం



# శ్రీ బాబు బృందావన ధామము - శ్రీ స్వామి నారాయణ్ అక్షర ధామము



(గత సంచిక తరువాయి)

కేదారనాథ్ నుండి కొండలు ఎక్కుతూ దిగుతూ దీపావళి నాటికి బద్రీనాథ్ చేరాడు (అక్టోబర్ 1792). అక్కడ అర్చకస్వామి నీలకంఠ్ దివ్యత్వాన్ని గ్రహించి, అతనికి ప్రసాదం ఇచ్చి ఇలా అన్నాడు,"ఇక ఇక్కడ అంతా మంచు కప్పివేస్తుంది. ఆలయ గుడి తలుపులు మూసివేస్తారు. నర నారాయణమూర్తులను ఏనుగ అంబారీలోఊరేగిస్తూ జోషీమఠం తీసుకు వెళ్తారు. నువ్వుకూడా జోషీమఠ్‌కు వచ్చెయ్యి." నీలకంఠ్ ఆయన ప్రస్తావనను స్వీకరించి జోషీమఠ్‌కు దిగి వచ్చాడు. కాని అక్కడ వుండటానికి నిరాకరించాడు.

జోషిమఠ్ నుంచి ఎత్తైన, దుర్గమమ్మైన హిమాలయ పర్వతాలను ఎక్కటం మొదలుపెట్టాడు. మంచు కప్పి ఉన్న కొండలలో నడుస్తుంటే, మంచు క్రింద ప్రవహిస్తున్న నీటిలో పడేవాడు. పట్టు విడువక కొండ ఎక్కుతూ ఎంతో లోతులో ఉన్న లోయలోకి జారి పడేవాడు. భగవంతుడే అండగా నిలిచి ఏ ప్రమాదము రాకుండా కాపాడాడు. అలా ప్రయాణం చేసి మానససరోవర్ ప్రాంతాలకు చేరాడు. అది భూమికి 14,950 అడుగుల పైన స్థితమ్మై ఉన్నది. మానససరోవర్‌లో గ్రుంకులిడినాడు. అక్కడనుంచి బెంగాల్ వైపు ప్రయాణం సాగించాడు. పులులు ఉండే సుందర వనాలు దాటి దక్షిణ గుజరాత్ అడవులు దాటి కథైవాడ్ చేరాడు. కాలికి చెప్పులు లేకుండా కౌపీన ధారియై ఈ మంచు కొండలలో ప్రయాణం చేశాడు.

నేపాల్ దేశానికి వెళ్ళి గోపాల్ యోగికి శిష్యుడై అష్టాంగయోగం అభ్యసించాడు. 9 నెలలలోనే అష్టాంగయోగంలో ప్రావీణ్యం సంపాదించాడు. ఆత్మ జ్ఞాన సంపన్నుడైనాడు. అనేక దివ్య శక్తులు ఆయన వశమైనాయి. నిత్యం గీతా పారాయణ చేసేవాడు. ముఖ్యంగా రెండవ అధ్యాయంలో చెప్పబడిన ఆత్మ తత్త్వం, స్థిత ప్రజ్ఞుని లక్షణాలు మొదలైన అంశాలను శ్రద్ధగా ఆకళింపు చేసుకొన్నాడు. 1795లో నేపాల్ రాజధానియైన ఖట్మాండుకు వచ్చాడు. నేపాల్ రాజుగారైన రావు

బహద్దూర్ షాకు ఎవ్వరూ నివారించలేకపోయిన విపరీతమైన కడుపునొప్పిని తన దివ్య శక్తితో నివారించి ఆయనకు స్వస్థత చేకూర్చాడు. ఆయనకు ఆత్మబోధ చేసి కారాగారంలో బందీలుగా ఉన్న సాధువులను విడిపించాడు.

ఖట్మాండునుండి తూర్పుదిశగా బయల్దేరి కామాక్షి (గౌహతి)కి వచ్చాడు. అక్కడ 'పిబెక్' అనే తాంత్రికుడు క్షుద్ర శక్తులను వశం చేసుకొని ప్రజలను పీడిస్తున్నాడు. పిబెక్ నీలకంఠ్‌ను తన శక్తులతో మట్టు పెట్టాలని చూశాడు. నీలకంఠ్ ముందు అతని శక్తులన్నీ నిర్వీర్యమైనాయి. పిబెక్ నీలకంఠ్‌ని క్షమించమని వేడాడు. అక్కడనుంచి సుందర్‌బన్స్ దాటి పూరీలో ఉన్న జగన్నాథపురి చేరి అక్కడ 6 నెలలు ఉన్నాడు. పంచ భూతాల నిజ తత్త్వాన్ని తెలిపే ప్రతి చోటకు వెళ్ళి, ఈశ్వరుడు, జీవుడు, మాయ, బ్రహ్మ, పరబ్రహ్మ - ఈ అయిదు తత్త్వాల రహస్యం గురించి అడిగేవాడు. కాని ఎవ్వరూ అతనికి సంతృప్తికరమైన జవాబు ఇవ్వలేకపోయారు.

రామేశ్వరానికి వెళ్తుంటే 'సేవక్‌రామ్' అనే సాధువు రక్త విరేచనాలతో తీవ్రంగా బాధపడుతుంటే, తన ప్రయాణం ఆపుకొని అతనికి రెండు నెలలు సేవ చేశాడు. ఆ సాధువు ఇచ్చిన ధనంతో అతనికి రొట్టెలు చేసి పెట్టేవాడు. కాని తనకొరకు భిక్షాటన చేసి దొరికిన దానితో తృప్తి పడేవాడు. కొన్నాళ్లు భిక్ష దొరికేది కాదు. దక్షిణ దిశగా పయనించి శ్రీ రామానుజాచార్యుల వారు ఉన్న ప్రదేశానికి వచ్చాడు. శ్రీ రామానుజాచార్యులవారు నెలకొల్పిన విశిష్టాద్వైతం ఆయనను ఎంతగానో ఆకట్టుకొంది.

కన్యాకుమారి దర్శించి ఉత్తరదిశగా ప్రయాణం చేసి గుజరాత్ లోని ఖథైవాడ్‌కు 1799లో వచ్చాడు. 7 సంవత్సరాల యాత్రాకాలంలో 177 క్షేత్రాలను దర్శించాడు. 12000 కిలోమీటర్లు పాదయాత్ర గావించాడు. నీలకంఠ్ అవలంబించిన దీక్షలవల్ల, నిద్రాహారాలు మాని చేసిన యాత్రల వల్ల ఆయన శరీరం తూట్లు పడి, రక్తం బదులుగా ప్లాస్మా(తెల్లటి ద్రవ పదార్థం) బయటకు వచ్చేది. యాత్రలో వారి గమ్యం ఆత్మజ్ఞాన సముపార్జన. వారు ఆత్మ జ్ఞాన సంపన్నులై ఎంతో మంది దీనార్తులకు ఒదార్పు కలిగించారు. ఎంతోమందిని రోగవిముక్తులుగా చేసేవారు. ఎందరో సాధువులు భగవదనుగ్రహం పొందేటట్లు చేశారు.

-సశేషం

# ధనుర్మాస వైభవం

- సుషుమ్నా ప్రసాద

కాలస్వరూపుడు, విశ్వానికి కాంతి ప్రదాతయైన శ్రీ సూర్య భగవానుడు కాలగమనాన్ని తెలియజేస్తూ, పన్నెండు నెలలూ, పన్నెండు రాశుల్లో ప్రవేశిస్తాడు. పన్నెండు నెలల కాలాన్ని మనమొక సంవత్సరంగా పరిగణిస్తాం. సూర్యభగవానుడు ధనస్సు అనే రాశిలో ప్రవేశించినప్పుడు, ఆ మాసమును ధనుర్మాసంగా పరిగణిస్తాము. ధనుర్మాస మనేది ఆధ్యాత్మిక సాధకులకు అత్యంత ప్రియమైన, పవిత్రమైన మాసము. ధన్యత్వమును, నిత్యత్వమును ప్రసాదించి, మానవ జీవితమును సార్థకము చేస్తుంది కాబట్టి ఈ మాసమునకు ధనుర్మాసమనే నామం సార్థకనామధేయం వచ్చింది.

ఆధ్యాత్మిక శోధనకు అనుకూలంగా వుండే యీ మాసం ఆంగ్లకాలమాన ప్రకారం, సాధారణంగా ప్రతి సంవత్సరము డిసెంబర్ 16వ తేదీన ప్రారంభం అవుతుంది. మార్తాండుడు మకరరాశిలో ప్రవేశించగానే ధనుర్మాసం సమాప్తమవుతుంది. అంటే మకర సంక్రాంతి పర్వదినాన ధనుర్మాసం వైభవోపేతంగా సంపూర్ణమై సంతృప్తిని ప్రసాదిస్తుంది. ధనుర్మాసం మార్గశిర మాసంలో ప్రారంభం అవుతుంది. ధనస్సు ప్రణవానికి సంకేతం. బాణం జీవునకు సంకేతం. జీవాత్మను పరమాత్మలో లయింపజేసేది ప్రణవము. ప్రణవోపాసన ద్వారా మన లక్ష్యాన్ని లేదా గమ్యాన్ని సాధిస్తాము. ఆధ్యాత్మిక ప్రగతికి దోహదం చేసే, శ్రేష్ఠమైన (శిరస్సు వంటి) మార్గాన్ని ప్రసాదించే మాసం కాబట్టి ఈ మాసాన్ని మార్గశీర్ష మాసంగా పరిగణిస్తాము.

అందుకనే శ్రీకృష్ణ భగవానుడు విభూతియోగంలో (10వ అధ్యాయము) '*మాసానాం మార్గశీర్షోహం ఋతూనాం కుసుమాకరః*' అని అన్నారు. అంటే 'మాసములలో మార్గశీర్షమాసము, ఋతువులలో వసంత ఋతువు నేనే' అని చెప్పారు. శ్రేష్ఠమైన (శిరస్సు వంటి) ఆధ్యాత్మిక ప్రగతికి మార్గము చూపే యీ మాసము ప్రణవనాదమునకు సంకేతం. మాధవుని మహిమను మానవాళికి ప్రసాదించే యీ మాసము మహిళలకు మంగళప్రదము, ఆనందదాయకము, కళ్యాణ ప్రదము!

ఈ ధనుర్మాసంలోనే ద్వాపరయుగంలో గోపకన్యలు, శ్రీకృష్ణ పరమాత్మను పరిణయమాడగోరి, వానలు కురవటమనే నెపంతో, పెద్దల అనుమతిని పొంది, శ్రీకృష్ణుని ఆదేశానుసారం ధనుర్మాసంలో 'కాత్యాయనీవ్రతం' అనే ఒక నోమును ప్రతిరోజు ప్రాతఃకాలం నుండి సాయంకాలం వరకు ఆచరించి, తద్వారా తమ కోరికను సిద్ధింప జేసుకున్నారు.

శ్రీ మహాలక్ష్మి వైకుంఠంలో శ్రీమహావిష్ణువు కొరకు శ్రీదేవి, భూదేవి, నీలాదేవి అనే మూడు రూపాలలో సేవ చేస్తుంటుంది. శ్రీ మహావిష్ణువు భూలోకంలో ఏ రూపం ధరించినా, శ్రీ మహాలక్ష్మి కూడా తదనుగుణంగా రూపం ధరించి స్వామికి అనపాయియై, విడువకుండా సేవలు చేస్తుంటుంది. అందుకే పెద్దలు 'రాఘవత్వేభవత్ సీతా, రుక్మిణీ కృష్ణ జన్మని, అన్యేషు చావతారేషు విష్ణోరేషానపాయినీ।' అన్నారు. (విష్ణుపురాణం). శ్రీమహావిష్ణువు రాముడయితే, శ్రీమహాలక్ష్మిసీతయైనది. అలాగే ద్వాపరయుగంలో శ్రీమహావిష్ణువు కృష్ణుడయితే ఆమె రుక్మిణి అయినది. అలాగే కలియుగంలో విష్ణువు శ్రీరంగనాథుడయితే, ఆమె ఆండాళ్ తల్లిగా అవతరించినది.

శ్రీ సీతాదేవి, శ్రీ రుక్మిణీదేవి, శ్రీ గోదాదేవి (ఆండాళ్) ఈ ముగ్గురూ 'నారీణాముత్తమా' అనగా స్త్రీలలో ఉత్తమోత్తములు అని కీర్తింపబడ్డారు. అయోనిజలుగా ఈ ముగ్గురు ఉత్తమ నారీమణులను పేర్కొంటారు. వీరిలో త్రేతాయుగంలో శ్రీ సీతామహా లక్ష్మి యజ్ఞముచే పవిత్రము కాబోవు భూమియందు వెలసి, జ్ఞానవైరాగ్య చక్రవర్తియైన జనకమహారాజు ఒడిలో గారాల పట్టిగా పెరిగి, వేదవేదాంగములను, సకల విద్యలను నేర్చి, లోకనాథుడైన శ్రీరామచంద్రుని ఇల్లాలుగా నుతికెక్కింది.

-సశేషం

*భగవంతుని సగుణంగా (సాకారముగా) గాని, నిర్గుణంగా (నిరాకారునిగా)గాని ఆరాధించవచ్చు. దీపం నుండి దీపకాంతిని విడదీయలేనట్లు సగుణ- నిర్గుణములకు భేదమేలేదు.*

- శ్రీ బాబూజీ మహరాజ్

# అస్ఖలిత బ్రహ్మచారి - నిత్యోపవాసి

- అఖిల

ఒక అరణ్యంలో నదికి ఇవతలి ఒడ్డున వశిష్ట మహర్షి, అవతలి ఒడ్డున అగస్త్య మహర్షి కుటీరాలు నిర్మించుకుని తపస్సు చేస్తున్నారు. రోజూ రెండు పూటలా వశిష్టుని భార్య అరుంధతి వంటచేసి, నదిని దాటి అవతలి ఒడ్డున ఉన్న అగస్త్యమహర్షికి ఆహారం తీసుకుని వెడుతోంది. అప్పుడు నది బాగా ఎండిపోయింది. కొంతకాలం ఇలా గడిచింది.

ఒకనాడు ఆ నది బాగా వెల్లువతో పొంగి పొరలుతోంది. ఆ రోజు అరుంధతి వశిష్ట మహర్షిని సమీపించి, 'స్వామీ! ఈ రోజు నదిని దాటి వెళ్ళటం ఎలా?' అని అడిగింది.

వశిష్టుడు ఒక్క క్షణం ఆలోచించి, 'బ్రహ్మచారియైన వశిష్టుడు దారి ఇమ్మన్నాడని అడుగు. నది దారి ఇస్తుంది' అని చెప్పాడు. 'మరి వచ్చేటప్పుడెలా?' అని అడిగింది అరుంధతి. 'ఆ సంగతి అగస్త్యుడు చూసుకుంటాడులే' అని చెప్పాడు వశిష్టుడు.

అరుంధతి నదిని సమీపించి భర్త చెప్పినట్లే అడిగింది. వెంటనే ఆ నది రెండు పాయలుగా చీలి దారి ఇచ్చింది. అరుంధతి ఆ నదిని దాటి అగస్త్యుని సమీపించి, ఆయనకు భోజనం పెట్టి, తిరుగు ప్రయాణంలో నదిని దాటటం ఎలా అని ఆయనను అడిగింది.

దానికి అగస్త్యుడు ఒక్క క్షణం ఆలోచించి, 'నిత్యోపవాసియైన అగస్త్యుడు దారి ఇమ్మన్నాడని అడగు తల్లీ!' అని చెప్పాడు. ఆమె అట్లాగే అడిగింది. ఆ నది దారి ఇచ్చింది.

ఆమె ఆశ్రమానికి వెళ్ళి, సమయం చూసి తన భర్తను ఆశ్చర్యంగా అడిగింది 'మీరు నూర్గురు బిడ్డల తండ్రి కదా! మీరెట్లా బ్రహ్మచారి అయ్యారు? అగస్త్యులవారికి నేనే రెండు పూటలా ఆహారం తీసుకు వెడుతున్నానే! మరి ఆయన ఎట్లా నిత్యోపవాసి అయ్యారు?' అని అడిగింది.

వశిష్ట మహర్షి మందహాసంతో "అదా నీ సందేహం, 'అహం' అంటే 'నేను' లేనివాడు గృహస్థుడైనా బ్రహ్మచారే! అహం లేనివాడు భోజనం చేస్తున్నా, చేయనివాడే! ఉపవాసే! ఇదీ రహస్యం!" అన్నాడు. అరుంధతి మనస్సు సమాధాన పడింది.

# నామ మహిమ

- మురళీ

మల్లవంశపు రాజు రాజా గోపాలసింహుడు పరమ వైష్ణవుడు. రాత్రింబవళ్ళు కేవలం భగవంతుని నామమే స్మరించేవాడు. రాచకార్యాలయందు ఉదాసీనంగా వుండేవాడు. జపమాలను చేతిలో వుంచుకుని, భక్తులతో ధర్మచర్చ చేస్తుండేవాడు. వైష్ణవులకు, సాధు సన్యాసులకు భక్తిభావనతో సేవ చేసేవాడు. తన రాజధాని విష్ణుపురంలో బాలురు, వృద్ధులు, సేవకులతో సహా సమస్త ప్రజలు రోజుకు ఒక్కసారైనా హరినామ మాల జపం చేయాలని ఆదేశించాడు. ఈ జపం జరుగుతున్నదో లేదో తెలుసుకోవడానికి అనేకమంది గూఢచారులను నియమించాడు. తాను కూడా మారువేషంలో తిరుగుతూ వుండేవాడు.

మరాఠా సేనాపతి భాస్కర పండితుడు మల్లరాజ్యంపై దండయాత్ర చేయడానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. గోపాలసింహుని ఉదాసీనతను బలహీనతగా భావించి, ఇదే మంచి సమయమని దండయాత్రకు వచ్చి 'ముండమాలాఘాట్' వద్ద నిలిపాడు సైన్యాన్ని. అక్కడే మల్లరాజ్యానికి ఒక దుర్గం ఉంది. దానిని జయిస్తే తప్ప మల్లరాజ్యంలోకి ప్రవేశించడం కష్టం. మధ్యాహ్న సమయంలో మరాఠా సైనికులలోని ఒక దళం దుర్గం వద్దకు చేరుకున్నారు. మరాఠా సైనికులు ముందుకు సాగుతుండగా, మల్లరాజ్యపు సైనికుడు ఒకడు చూసి, ముందుగానే ఏర్పాటు చేసి వున్న ఫిరంగులను పేల్చాడు. మిగిలిన మల్లరాజ్యపు సైనికులు అప్రమత్తులై ఫిరంగులను పేల్చటంతో అనేకమంది మరాఠా యోధులు మరణించారు. మల్లరాజ్యపు సైనికులు తక్కువగా వున్నప్పటికి తమ ప్రాణాలను పణంగా పెట్టి యుద్ధం చేశారు. యుద్ధం భీకర రూపం దాల్చింది. మరాఠా సైనికులు దుర్గాన్ని చుట్టుముట్టారు. మిగిలిన సైనికులు దర్బారుకు చేరుకుని విషయం రాజుకు తెలియ జేశారు.

కోటలో నలభైవేల మంది సుశిక్షితులైన సైనికులు వున్నారు. వారిని జయించటం మరాఠాసేనకు తేలిక కానప్పటికీ, రాజు గోపాలసింహుడు ప్రజలందరినీ తమ పరివారాన్ని తీసుకుని వెంటనే దుర్గం లోపలికి రావలసినదిగా ఆదేశించాడు. ప్రజలు

భయభీతులైనందున వెంటనే రాజప్రాసాదంలోకి వచ్చి, ఆశ్రయం పొందారు. రాజు వేరే ఉపాయం లేదని భావించి, దుర్గంలోని వారందరినీ విశ్వాసంతో హరినామాన్ని చేయమని ఆజ్ఞాపించాడు. రాజు స్వయంగా తాను ఆచరిస్తూ ప్రజలందరిచేత హరినామ సంకీర్తన చేయించ సాగాడు. కోట హరినామముతో ప్రతిధ్వనించసాగింది.

రాజుగారి ఆజ్ఞకై ఎదురు చూడకుండా, మల్లరాజ్య సేనాధిపతి విశ్వసనీయులైన సైనికులను అంతఃపుర రక్షణకోసం వినియోగించి, మిగిలిన సైనికులను కోట నలుమూలలా ఏర్పాటుచేసి, ఫిరంగులలో గంధకం నింపి, యుద్ధానికి సిద్ధం చేశాడు. రాజు ప్రజలతో కలసి హరినామ సంకీర్తనలో మునిగిపోయాడు. తెల్లవారగానే మల్లసైనికులు యుద్ధం మొదలు పెట్టారు. మరాఠా సైనికులు దుర్గం ఆక్రమించడానికి కందకం దాటబోయారు. మల్లసైనికులు ఫిరంగులతో, తుపాకులతో దాడి చేశారు. మరాఠా సైనికులు మరణించ సాగారు. వారి శవాలు కందకంలో పడి కొట్టుకుపోసాగాయి. ఈ విధంగా మరాఠా సైనికుల మూడు దళాలు ప్రయత్నించి విఫలమయ్యాయి. రాజుకు ప్రజలకు ఫిరంగుల మోత వినిపిస్తోందేకాని ఏమి జరుగుతోందో తెలియదు. హరినామ సంకీర్తన ప్రవాహ మహిమతో స్వామి కరుణ ఉప్పొంగి, ఆయన లీల మొదలయింది.

రెండు సేనలు అలసిపోయాయి. మరాఠా సైనికులు కందకాన్ని దాటి విశ్రాంతికై వెనుక ఉన్న అరణ్యంలోకి వెళ్ళిపోయారు. మల్ల సైనికులు విశ్రాంతి తీసుకుంటూ ఫిరంగులలో మందు నింపసాగారు. క్రొత్త క్రొత్త సైనికులు దుర్గంలోకి రాసాగారు. ఇంతలో ఒక వ్యక్తి గుఱ్ఱంపై అతివేగంగా రాజప్రాసాదం నుండి బయటకు వచ్చి, మరాఠా సైనికులవైపు వెళ్ళిపోయాడు. ఒక్కసారిగా ఫిరంగులు గర్జించాయి. అరణ్యంలో సైనికులు విశ్రాంతి తీసుకునే చోట ఫిరంగుల గుళ్ళు అసంఖ్యాకంగా వాన చినుకులవలె పడసాగాయి. లెక్కలేనంత మంది మరాఠా సైనికులు నేలకొరిగారు. చూస్తుండగానే మరాఠా సైన్యం అంతరించిపోయింది. భాస్కర పండితుడు పరాజయాన్ని స్వీకరించి మిగిలిన సేనతో వెనుదిరిగాడు. కొంతమంది సైనికులు దిక్కుతోచక పారిపోగా, భాస్కర పండితుడు కొద్దిమంది సైన్యంతో అడవిలో దాక్కున్నాడు. అడవిలో దారి తెలియక వెదుక్కుంటూ చాలా కాలం అడవిలోనే వుండిపోయాడు.

చివరకు మేదినీపురం జిల్లాలోని ఒక గ్రామం చేరుకున్నాడు.

అంతఃపురంలో ప్రతిష్ఠింపబడిన భగవాన్ మదనమోహన స్వామి ప్రజల సంకీర్తనకు సంతుష్టుడై సైనికుడి వేషంలో గుఱ్ఱంపై స్వారీ చేస్తూ, శత్రుసైనికులపై ఫిరంగులను పేలుస్తూ వీరవిహారం చేసి, శత్రువులను తరిమికొట్టి తిరిగి వస్తూ ఫిలంగులను లాల్‌బాంధ్ చెరువుకు రెండువైపులా వదలి, అంతఃపురంలోకి చేరుకున్నాడని ప్రజల గాఢ విశ్వాసం. ఆ ఫిరంగులు ఈ నాటికీ చెరువు వద్ద తుప్పు పట్టకుండా వున్నవట. ఈ ఫిరంగులు సుమారు 12 అడుగుల పొడవు, ఒకఅడుగు వ్యాసము కలిగినవి. మానవమాత్రుడు ఎవరూ వాటిని కదల్చలేరనటంలో సందేహం లేదు. ఇది భక్తవత్సలుడు, దయాసింధువు అయిన భగవానుడు మదనమోహన స్వామి లీల తప్ప, వేరెవరికీ సాధ్యం కాదని రాజు గోపాలసింహుడు, ప్రజల నమ్మకం. ఇది బెంగాలు దేశంలో 18వ శతాబ్దపు ప్రథమార్థంలో జరిగిన యదార్థ గాథ!

## *మార్చి 2019లో శ్రీ మాతాజీవారి ఆశ్రమేతర సత్సంగ కార్యక్రమాలు*

మార్చి 2019

5 - కామేపల్లిలో హరినామ సప్తాహాలకు హారతి.

21 - తెనాలి - అష్టలక్ష్మి ఆలయంలో దండిస్వామివారి కార్యక్రమం.

23 - 30 వరకు అన్నవరంలో జరుగు హరేరామనామ సప్తాహ సత్సంగ కార్యక్రమం.

## శ్రీ బాబూజీ మహరాజ్ అనుగ్రహముతో
## శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి పర్యవేక్షణలో జరుగనున్న
## 'హరేరామ నామ సంకీర్తన, సత్సంగ సప్త సప్తాహాలు'
## భక్తులకు విజ్ఞప్తి

పైన వివరించిన కార్యక్రమాలు శ్రీఅన్నవరం శ్రీ సత్యదేవుని సమక్షంలో ప్రారంభమై, పంచారామాలలో సప్తాహములు చేసుకుని చివరిగా శ్రీకాళీవనాశ్రమంలో సంపూర్ణం చేయబడతాయి. ఈ విషయం భక్తులందరికి కరపత్రములు (పేంప్లెట్స్) ద్వారా తెలియపరచటమైనది.

కార్యక్రమ వివరములు : తె జా 4 గం.లకు సుప్రభాతం; 4గం 30 ని.లకు ప్రార్థన; 9గం.లనుండి 10 గం.ల వరకు శ్రీశ్రీనివాస రామానుజదాసు గారి ప్రవచనము;11 గం.లకు మరియు సాయంత్రం 6 గం.లకు శ్రీ మాతాజీ మరియు మహాత్ముల అభిభాషణము ఉంటాయి. ఈ సప్తాహాలలో అఖండ హరేరామ నామ సంకీర్తన శ్రీ శివాజీ, కామేపల్లివారి ఆధ్వర్యంలో జరుగును.

సప్త సప్తాహముల వివరములు : 1. ది.23.3.2019 నుండి ది,30.3.2019 వరకు **అన్నవరం శ్రీ సత్యన్నారాయణ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో** ; 2. ది. 24.04.2019 నుండి ది. 01.05.2019 వరకు కుమారారామం, సామర్లకోటలో ; 3, ది. 20.05.2019 నుండి ది.27.05.2019 వరకు భీమారామం, ద్రాక్షారామంలో ; 4. ది.05.08.2019 నుండి ది.12.08.2019 వరకు సోమారామం, భీమవరంలో ; 5. ది.08.09.2019 నుండి ది.15.09.2019 వరకు క్షీరారామం, పాలకొల్లులో ; 6.ది.18.10.2019 నుండి ది.25.10.2019 వరకు అమరారామం, అమరావతిలో ; మరియు 7. ది.15.11.2019 నుండి ది.22.11.2019 వరకు శ్రీగురు ఆరామం, శ్రీ కాళీవనాశ్రమం (నంబూరు)లో నిర్వహించబడును.

భక్తులందరూ బహు సంఖ్యాకంగా విచ్చేసి, ఈ కార్యక్రమాలను జయప్రదం చేయమని ప్రార్థిస్తున్నాము. భారీ ఎత్తున జరిగే ఈ కార్యక్రమాలు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడినవి. కావున భక్తులు ఈ విషయాన్ని గుర్తించి, ధన రూపంలోను, అమూల్యమైన సేవలరూపంలోను తమ సహాయ సహకారాలను అందించమని భక్తులను ప్రార్థిస్తున్నాము. భక్తులు ఇచ్చే విరాళాలకు ఐ.టి యాక్ట్ 80 జి రాయితి లభిస్తుందని తెలియజేస్తున్నాము.

పూర్తి వివరాలకు ట్రస్ట్ ఆఫీస్ 0863 - 2293564;

కె.మురళీమోహన వర్మ సెల్ - 93983 34345 మరియు

కుమార స్వామి రాజా సెల్ - 93465 35357లను సంప్రదించగలరు.

# ఆధ్యాత్మికంలో హాస్యకథలు

- కె.పి. చల్లా

భక్తుల జీవితాలలో, మహాత్ముల ప్రసంగాలలో కొన్ని హాస్య మిళితమైన సన్నివేశాలు, సమయస్ఫూర్తికరమైన ఘటనలు జరుగుతూ ఉంటాయి. నేను  విన్నవాటిలో; చదివినవాటిలో కొన్ని:

**1. శ్రీ ఏకనాథ్ స్వామి వారి సమయస్ఫూర్తి -**

ఆ ఊరికి ఒక పేద బ్రాహ్మణుడు వచ్చాడు. తన కూతురి పెళ్ళికి వర దక్షిణ కోసం  200 రూపాయలు  సహాయం చేయమని ఆ ఊరి వారిని అర్థించాడు. ఎవ్వరూ సహాయం అందించలేదు. చివరకు కరటక శాస్త్రిగారు, 'నువ్వు కనక శాంత స్వభావులైన ఏకనాథస్వామివారికి కోపం తెప్పిస్తే, నీకు నేను సహాయం చేస్తానన్నాడు.

బ్రాహ్మణుడు నాథ్ గారింటికి వెళ్ళేసరికి ఆయన పూజా మందిరంలో ఉన్నారు. అక్కడికి సరాసరి చెప్పులతో వెళ్ళి ఆయన ఒళ్ళో కూర్చున్నాడు. ఆయన ధ్యానం నుండి తేరుకుని, 'బాగున్నావా? కృష్ణాజీ! అని భార్య గిరిజాబాయితో, " కాసిని మంచినీళ్ళు, పటికబెల్లం తెస్తావా? నా స్నేహితుడొకడు వచ్చాడు. ఎంతో ఆతురతగా వచ్చి చెప్పులు విప్పాలనే సంగతి మరచిపోయాడు"అన్నాడు. ఆ బ్రాహ్మణుడు ఆశ్చర్యంతో, 'నా పేరు మీకెలా తెలిసింది?' అన్నాడు. 'అది జన్మ జన్మల బంధం. కొన్ని కారణాల వల్ల నువ్వు మరిచావు. కాని నేనెలా మరుస్తాను?' అని లే! లే! భోంచేద్దువుగాని. అన్నారు. 'నేను గోదావరినదికి వెళ్ళి స్నానం చేసి వస్తాను.' అన్నాడు. 'అలాగా! నువ్వు వచ్చాక అందరం భోంచేద్దామ'న్నారు నాథ్ గారు.  అతడు కావాలని తిరిగి తిరిగి సాయంత్రానికి చేరుకొన్నాడు. 'ఏమిటి ఇంత ఆలశ్యం? ఎప్పుడనగా తిన్నావో ఏమో?' అని అతడిని పంక్తిలో కూర్చోబెట్టారు. గిరిజాబాయి నెయ్యి వడ్డిస్తుంటే చటుక్కున  ఆమె వీపు పైకి ఎక్కి కూర్చున్నాడు. 'అతడు పడతాడు జాగ్రత్త!' అని, 'ఇతడు నా పెద్ద కొడుకండీ! బొత్తిగా అల్లరివాడు' అన్నారు నాథ్ అక్కడివారితో. ఆ బ్రాహ్మణుడు చటుక్కున ఆమె వీపు నుండి దిగి నాథ్ గారి కాళ్ళపై పడి జరిగినదంతా చెప్పాడు.

'అరే! నాకు కోపం తెప్పించటనికి అంత పని చేశావా? నన్నడిగితే నేనే ఇచ్చేవాడిని ఆ రెండొందలు' అని భోజనం అయ్యాక రెండొందలు ఇస్తూ,  'అమ్మాయి పెళ్ళికి ఇది కట్నంగా ఇచ్చి, పెళ్ళి ఘనంగా జరిపించు' అని, 'మిగతా రెండు వందలు నీకు వీధిలో ఇప్పిస్తా ' అని ఆ బ్రాహ్మణుడిని కోపంతో కొడ్తున్నట్లు నటిస్తూ వచ్చి, అక్కడ ఉన్న కరటక శాస్త్రి బృందంతో

'ఇతడు నాకు కోపం తెప్పించాడు. ఆ రెండు వందలు ఇతనికి ఇవ్వండి' అన్నారు నాథ్. కరటక శాస్త్రి గారికి రెండు వందలు ఇవ్వక తప్పలేదు.

**2. పూజ్య శ్రీ దండి నిర్మలానందగిరి స్వామివారి ప్రసంగాలనుండి:**

భోగభాగ్యాల వలన వచ్చే ఆనందం క్షణికం:

నచికేతుడు యమధర్మ మహారాజును, "మానవుడు మరణించిన తరువాత ఏమవుతాడు?" అని అడుగుతాడు. "అది పరమ రహస్యమైనది. దేవతలకుకాడా అంతుపట్టని విషయం. నువ్వు చాలా చిన్నవాడవు. ఇంకేదైనా వరం కోరుకో. నీకు దీర్ఘాయుష్షు ప్రసాదిస్తాను. అనేక భోగ భాగ్యాలు ప్రసాదిస్తాను. ఏమి కావాలో కోరుకో" అంటాడు సమవర్తి. ఇవన్నీ క్షణికమైనవి. ఈ ప్రపంచ విషయాలలో లభించే ఆనందం క్షణికం. శాశ్వతానందం కలుగజేసే మరణానంతర రహస్యాన్ని నాకు బోధించమ"ని యముడిని అడుగుతాడు నచికేతుడు.

ఈ క్షణిక భోగాల విషయం గురించి విశ్లేషిస్తూ స్వాములవారు తమ ప్రసంగంలో ఇలా అన్నారు: 'ఒకసారి ఇంద్రుడు శాపవశాత్తు పంది జన్మ ఎత్తాల్సి వచ్చింది. అతను ఒక బురద గుంటలో వుండగా, శ్రీరామ చంద్రుడు అతడిని గుర్తించి, 'నేను బాణం వేసి నిన్ను పంది జన్మ నుంచి విముక్తి కలిగిస్తాను' అంటాడు. 'రామా! నాకు ఇక్కడ చాలా హాయిగా వుంది. మరైతే అక్కడ స్వర్గంలో బురద గుంటలు ఉంటాయా?' అని అడిగాడు ఇంద్రుడు.

మాయ (అవిద్య లేక అజ్ఞానం):

క్షణకాల మాత్రం బ్రహ్మానుసంధానం చేయకపోయినా మాయ ప్రవేశిస్తుంది. తత్త్వాన్వేషణలో ఉన్నవారికి దేవతలు ఎన్నో విఘ్నాలు కలిగిస్తారట. ఒకసారి శనిదేవుడు 'పడితే పెద్దవారినే పట్టాలి' అని నిర్ణయించుకొని బ్రహ్మను పట్టాలనుకున్నాడు. సృష్టి కర్త కంటే పోషించే విష్ణువు గొప్పవాడని అనుకొన్నాడు. కాని లయకర్త అయిన శివుడు గొప్పవాడు అతడిని పట్టాలని అనుకొన్నాడు. అయితే ఈ విషయం సర్వజ్ఞుడైన శివుడు ముందుగా తెలుసుకొని నత్తారామేశ్వరంలో దాక్కొన్నాడు. నిర్ణీత సమయం తరువాత శివుడు బయటకు వచ్చి, శని దేవునితో, "నువ్వు నన్ను పట్టలేకపోయావు" అంటాడు. శని, "నువ్వు హిమగిరినుండి దిగివచ్చి, ఈ కుళ్ళు కంపు కొట్టే నీటిలో ఉన్నావంటే నేను పట్టకపోతే నువ్వు ఇక్కడికి ఎలా వచ్చావు?" అని అంటాడు. కాబట్టి మాయను(అవిద్యను) దాటాలంటే దానికి ప్రణవోపాసన ఒకటే సాధనం" అన్నారు శ్రీ నిర్మలానందగిరి స్వామివారు.

-సశేషం

# న్యాయమైన సంపాదనకే గౌరవము

- గాలి జగదీశ్

ఒక ఊరిలో ఒక ఉన్నత ఉద్యోగి వుండేవాడు. అతడు తన అధికారాన్ని ఉపయోగించి, అధిక ధనాన్ని అక్రమంగా సంపాదించి, ఆ సంపాదనతో అనేక పుణ్యకార్యాలను చేస్తూ, కీర్తి ప్రతిష్ఠలను సంపాదించేవాడు. పెద్ద పెద్ద నూతులను, తటాకములను త్రవ్వించటం, అన్నదానము గొప్పకోసం ఇలా అనేకానేక మంచి పనులు, అసత్యమార్గంలో సంపాదించిన అక్రమసంపాదనతో చేస్తూ వుండేవాడు. కొంతకాలానికి ప్రభుత్వంవారు అతను అధికార దుర్వినియోగం చేస్తున్నాడని, అతనిని ఉద్యోగంలో నుండి తొలగించివేశారు. దానితో నిరుద్యోగికి క్రమంగా అతని ఆస్తిపాస్తులన్నీ తరగిపోయి, ఆఖరికి తినడానికి తిండి కూడా లేని స్థితికి చేరుకున్నాడు.

ఇది ఇలా వుండగా పొరుగు గ్రామంలో ఒక మంచి వర్తకుడు న్యాయ సముపార్జన చేస్తూ, పాత్రనెరిగి దాన ధర్మాలను చేస్తూ, భగవన్నామ సంకీర్తన చేసుకుంటూ, ఇతరులకు చేతనయినంత సహాయం చేస్తూ, వుండటమే కాక, ఇతరులు చేసిన పుణ్యకార్యాలను తులతూచి, వెలకట్టి కొంటాడని తెలిసి ఈ నిరుద్యోగి, అతని వద్దకు వెళ్ళి తాను ఇదివరకు చేసిన పుణ్యకార్యాల గురించి చెప్పి అతనికి ఇచ్చి, అతని దగ్గర నుండి కొంత ధనం తీసుకు వస్తానని భార్యకు చెప్పి బయలుదేరి వెళ్ళాడు. ఒకరోజు ప్రయాణం కాబట్టి దారిలో వండుకుని తినడానికి  కావలసిన వంట సామాగ్రి కూడా తీసుకుని వెళ్ళాడు.

కొంత ప్రయాణం సాగాక, నది ఒడ్డున, చెట్టుక్రింద కూర్చుని, వంట చేసుకుని భోజనం తినడానికి సిద్ధపడగా, ఇంతలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు చలికి ఒణికిపోతూ, ఆకలికి ఓర్చులేకపోతూ అతని దగ్గరకు చేరి యాచించాడు. అతన్ని చూసి జాలిపడి, తాను వండిన పదార్థం తనకే చాలీచాలనట్లుగా వున్నా కూడా  దాన్ని ఆరుముద్దలుగా చేసి, అందులో మూడు ముద్దలు తీసి ఆ వృద్ధుడికి సమర్పించాడు. ఆ వృద్ధుడు సంతోషంగా ఆ పదార్థాన్ని ఆరగించి, ఇతనిని దీవించి, తన దారిన తాను వెళ్ళిపోయాడు.

ఈ నిరుద్యోగి ఆ సాయంత్రానికి తాను చేరవలసిన స్థలానికి

చేరుకుని, ఆ మహోన్నత వ్యక్తిని కలుసుకున్నాడు. అతడు ఇతనిని సాదరంగా ఆహ్వానించి, భోజన సదుపాయాలను ఏర్పాటుచేసి, ఆ మరునాడు ఉదయమే ఒక త్రాసు తీసుకువచ్చి, 'స్వామీ! మీరు నాకు అమ్మదలచిన పుణ్యకార్యాలను త్రాసులో ఒకవైపు ఒక తాటి ఆకు మీద వుంచండి. ఆ త్రాసుకు రెండోవైపున నేను బంగారు కాసులను వుంచుతాను. ఎప్పుడైతే మీ పుణ్యానికి సమంగా తూగుతూ తక్కెడ పైకి లేస్తుందో, అప్పుడు ఎన్ని కాసులు తూగితే ఆ సొమ్ము మీరు తీసుకొనవచ్చు' అని చెప్పాడు.

దానికి ఇతడు కొంత తటపటాయించి, ప్రయత్నించి చూద్దామనే ఉద్దేశ్యంతో, 'తాను పూర్వం ఒక వేయి వరహాలు పెట్టి ధర్మసత్రం కట్టించాను ఆ పుణ్యాన్ని విక్రయిస్తున్నాను' అని ఒక తాటి ఆకు మీద వ్రాసి, ఆ ఆకును ఆ త్రాసులో ఒకవైపు ఉంచాడు. ఆ వర్తకుడు ఒక వరహా ఆ త్రాసుకు రెండవ వైపు వుంచాడు. ఆ తక్కెడ అసలు ఎక్కడా కదలలేదు, మెదలలేదు. దానికి ఆ వర్తకుడు అయితే మీరు చేసిన ఆ ధర్మములో ఏదైనా లోపము ఉన్నదేమో, మీ ఇతర ధర్మాలు ఏవైనా చేసినవి వుంటే వాటిని వెలకట్టండి' అన్నాడు. దానితో ఆ నిరుద్యోగి సిగ్గుపడి తానుచేసిన ధర్మాలన్నీ అక్రమసంపాదనతోనే చేశాను అని చెప్పాడు. అప్పుడు ఆ వర్తకుడు అయితే అవన్నీ దుర్వినియోగం అయిపోయాయి. కాబట్టి నీవు జీవకారుణ్యంతో, నిస్వార్థంగా చేసినదేదైనా వుంటే గుర్తుతెచ్చుకోమని చెప్పాడు. అప్పుడు ఆ నిరుద్యోగి నిన్న ప్రయాణంలో తాను ఒక వృద్ధుడికి మూడుముద్దలు పెట్టిన సంగతి గుర్తుకువచ్చి, 'అన్నదానంలో మూడు ముద్దలలో ఒక ముద్ద దానాన్ని విక్రయిస్తున్నానని చెప్పి తాటియాకుమీద వ్రాసి ఆ తక్కెడలో వేశాడు. వర్తకుడు రెండవ వైపు కాసులు వేస్తూ రాగా, పదివేల వరహాల దగ్గర ఆ త్రాసులోని రెండు తక్కెడలు సమానమయ్యాయి.

అప్పుడా వర్తకుడు 'అయ్యా! భగవంతునికి ప్రీతికరమైనది, శాస్త్రసమ్మతమైనది ఈ దానము' అని చెప్పి, ఆ పదివేల వరహాలు ఆ నిరుద్యోగికి ఇచ్చి, తాను ఆ తాటిఆకును తీసుకున్నాడు. దీనివలన మనం గ్రహించవలసినది శాస్త్ర సమ్మతమైన ధర్మ సూక్ష్మము ఇట్టిది అని తెలుసుకొనవలెను.

# గుడగూచి

- పి. విజయలక్ష్మి

**(శ్రీ పాల్కూరికి సోమనాధుని 'బసవ పురాణం' ఆధారంగా)**

కర్నాటక దేశంలో శివదేవయ్య అనే శివభక్తుడు నిత్యమూ కుంచెడు పాలు శివాలయంలో మహేశ్వరుడికి నైవేద్యం పెట్టేవాడు. ఒకసారి పనిమీద అతను ఊరు వెడుతూ, తన కూతురు గుడగూచి పదిసంవత్సరాల వయస్సుగల ఆమెను పిలిచి, 'అమ్మా! రోజూ గుడికి వెళ్ళి పరమేశ్వరునికి పాలు ఆరగింపు పెట్టమ్మా! నేను వచ్చేటప్పుడు నీకు ఆట బొమ్మలు కొనితెస్తాను' అని చెప్పి అప్పగించి వెళ్ళాడు.

మరునాడు ఉదయమే గుడగూచి స్నానం చేసి విభూతిరేఖలు నుదుట దిద్దుకుని, పాలుకాచి, కుంచెడు కొలిచి, కొంగు కప్పి, గుడికి పరుగుపెట్టి, శివలింగం ముందు పాలు ఉంచి, తాను సాష్టాంగ పడింది. 'ఆరగించు దేవా! శివా!' అని ప్రార్థించి, తాను వచ్చి గుడి బయట నిలబడింది. కొంచెంసేపు ఆగి, లోపలికి వెళ్ళి చూస్తే, ఎలా పెట్టిన పాలు అలాగే వున్నాయి. గుడగూచి కనుల వెంట నీరు వచ్చింది. భయపడి పోయి స్వామిని ఇలా అడిగింది ... 'పాలేల యారగింపవు లింగమూర్తీ! కాచుట చాలదో? కమ్మవల్వమినో? ప్రాచియెా? విఱిగెనో? పడుచనేనియో? ప్రొద్దెక్కెనో ? యొండెబొగయు వచ్చెడినో? బుద్ధి పుట్టదో? నెయ్యివోయకుండితినో? కడువేడియో? నీరుగలసినవనియో? ఎడవాద్యములు లేక తెచ్చిననో? చాలవో? ఇవి యాలపాలు గావనియో? ఆరగింపగబెట్ట నేరకుండితినో? మీదువోయినవో? మీగడలేదో? యూరకే మిటికి బాలొల్లవు దేవ! ''....... అంటూ పరిపరి విధముల వేడుకొన్ననూ గరళకంఠడు పలుకలేదు, ఉలకలేదు.

గుడగూచి తలబ్రద్దలు కొట్టుకుని ఏడ్చినా కూడా శివుని మనస్సు కరుగలేదు. అప్పుడామె ''పరమేశ్వరా! నీవు ఈ పాలు ఆరగించకపోతే నా తండ్రి కోపిష్ఠి. నన్ను ఎలగో చంపక మానడు. సందేహం లేదు. ఆ చచ్చేది ఇక్కడే చస్తాను. ఆ పేరు నీకే దక్కుతుందిలే'' అంటూ శివలింగానికి తన తల బాదుకోసాగింది.

పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఒక చేత్తో గుడగూచి తలపట్టుకుని, మరొక చేత్తో పాలు ఆరగించాడు. గుడగూచి పరమ సంతోషంతో శివుని

చేతిలోని కుంచాన్ని లాక్కుని, కోపాన్ని నటిస్తూ, బెదిరిస్తూ " నన్ను ఇంత బాధపెట్టావు కదా! చిన్నపిల్లను చేసి ఏడిపించావు కదా! ఊరుకోనులే! గుర్తుంచుకో! నీ పని మా అయ్యకు చెబుదాను!' అంటూ రుద్రుడిని భయపెట్టి ఇంటికి పరుగెత్తింది.

ఇలా నిత్యమూ గుడగూచి ఇంటినుండి పాలు తెస్తోంది. పరమశివుడు సాకారుడై వచ్చి ఆరగిస్తున్నాడు. ఒకరోజు గుడగూచి ఖాళీ కుంచెతో ఇంటికి పరుగెత్తుతోంది. శివదేవయ్య అప్పుడే ఊరినుండి తిరిగి వస్తూ ఎదురై, 'అమ్మా! వట్టి కుంచె తెస్తున్నావు, పాలు ఏమయ్యాయి?' అని అడిగాడు. 'శివునికి ఆరగింపుచేసి వస్తున్నాను' అన్నది గుడగూచి. తండ్రి కోపంగా చూస్తూ 'ఎక్కడైనా లింగం పాలు త్రాగుతుందా? వినని మాట, కనని మాట చెబుతున్నావు. నేను ఇన్నేళ్ళ నుండి ఆరగింపు చేస్తున్నాను. ఒక్కనాడైనా శివుడు త్రాగాడా? నీవే పొట్ట నిండా త్రాగేసి అబద్ధాలు ఆడువుతున్నావా? పద! ఇవాళ నీ చర్మం వలుస్తాను!' అంటూ గర్జించాడు.

గుడగూచి అమాయకంగా, 'నాన్నా! ఎందుకు వాదన? రేపు ఉదయం స్వయంగా చూద్దువుగాని పద!' అన్నది.

మరునాడు తండ్రీ కూతుళ్ళిద్దరూ ఆలయంలోకి ప్రవేశించారు పాలచెంబుతో. శివుడు పాలు ముట్టుకోలేదు. తండ్రి పండ్లు పటపటా కొరుకుతున్నాడు. గుడగూచి - హా లింగా! హాలింగ! హా లింగ!' అంటూ శివలింగాన్ని వాటేసుకుని కన్నీరు కారుస్తూ శివుని చేతికొరకై తడుముతోంది. చూస్తూ వుండగానే ఆ గుడగూచి శివలింగంలో కలిసి పోతోంది. శివదేవయ్య కంగారుగా ఏడుస్తూ 'నా బిడ్డ! నా బిడ్డ పోతోంది' అంటూ, ఆ పిల్లను పట్టుకోబోయాడు. అతనికి తలవెంట్రుకలు మాత్రమే చిక్కాయి. ఆ బాల లింగంలో కలిసిపోయింది!

గుడగూచి నిశ్చల భక్తిని, పరమేశ్వరుని కరుణను స్మరిస్తూ భక్తులంతా సంవత్సరానికి రెండు సార్లు గొప్ప ఉత్సవాలు చేస్తారు. లింగం మీద మిగిలిన వెంట్రుకలు పెరుగుతూ వుంటాయి. వాటిని ఈ ఉత్సవం రోజు కత్తిరిస్తూ వుంటారు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**మార్చి 2019**

4 సోమ - మహాశివరాత్రి - తె.జా 3-30ని॥ శ్రీబాబుకు బృందావనంలో నమకచమక సహిత రుద్రాభిషేకము; 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, 8గం. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక ఏకాదశ రుద్రాభిషేకములు; మధ్యాహ్నం 12గం. సహస్రఘటాభిషేకము; లక్ష బిళ్వార్చన; తీర్థప్రసాద వితరణ; భక్తసమారాధన. రాత్రి 7గం.లకు శ్రీ ఉమామహేశ్వరస్వామివారి సామూహిక కళ్యాణ మహోత్సవం; అనంతరం స్వామివారి నగరోత్సవం.

6 బుధ - అమావాస్య

9 శని - ఫాల్గుణ శుద్ధ తదియ - శ్రీ లలితానంద సరస్వతీస్వామిని వారి ఆరాధన, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

20 బుధ - పౌర్ణమి - హోళీ - శ్రీసద్గురుపాదపూజ.

30 శని - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

**ఏప్రియల్ 2019**

3 బుధ - మాస శివరాత్రి

5 శుక్ర - అమావాస్య

6 శని - శ్రీవికారి నామ సంవత్సర ఉగాది. ఉదయం 11గం.లకు పంచాంగ శ్రవణం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

7 ఆది నుండి 13 శని వరకు మౌనధ్యాన సాధన సప్తాహ శిబిరం.

14 ఆది - శ్రీరామ నవమి - తె.జా 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ; ఉదయం 11గం.లకు శ్రీ సీతారాముల సామూహిక కళ్యాణ మహోత్సము; భక్తసమారాధన.

19 శుక్ర - పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

29 సోమ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

# శ్రీ కృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

**ద్వితీయాశ్వాసము - 35 వ శ్లో॥**

**అఙ్గనా మఙ్గనా మన్తరే మాధవో మాధవం మాధవం చాన్తరేణాఙ్గనా ।**
**ఇత్థమాకల్పితే మణ్డలే మధ్యగః సఞ్జగై వేణునా దేవకీనన్దనః ॥**

**తాత్పర్యము -**

ఇద్దరు గోపికా స్త్రీల నడుమ కృష్ణుడు, ప్రతి ఇద్దరు కృష్ణుల నడుమ గోపిక, ఇట్లు రచింపబడిన గోపికా కృష్ణుల వలయమందు ఆ గుంపునడుమ జేరినవాడై కృష్ణుడు పిల్లన గ్రోవితో సొగసుగా బాడెను. వియత్పథంతో నిలబడి, వేల్పుల బృందమంతా వంగి వంగి చూస్తున్నారు. క్రింద పుడమిలో జరుగుతున్న వేడుకలను ఎంతో బ్రహ్మానందంతో జగత్కళ్యాణ కారకుడైన పరమాత్మ వ్రజభూమిలో అవతరించి జరుపుతున్న లీలను ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు అదేమిటంటే!



ఇద్దరు గోపికల నడుమ శ్రీకృష్ణుడు, ప్రతి యిద్దరు కృష్ణుల నడుమ గోపికయును ఇట్లు రచయింప బడిన గుంపు నడుమ చేరినవాడయి, శ్రీకృష్ణుడు పిల్లన గ్రోవితో సొగసుగా పాడటం చూశారు.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

**మార్చి 2019**

4 సోమ - మహాశివరాత్రి - రాత్రి 7 గం॥లకు శ్రీసద్గురుపాదపూజ

20 బుధ - పౌర్ణమి - హోలీ - రాత్రి 7 గం॥లకు శ్రీసద్గురుపాదపూజ.

30 శని - శ్రీగురుదశమి - రాత్రి 7 గం॥లకు శ్రీసద్గురుపాదపూజ.

**ఏప్రియల్ 2019**

6 శని - శ్రీవికారి నామ సంవత్సర ఉగాది. శ్రీసద్గురుపాదపూజ.

14 ఆది - శ్రీరామ నవమి - శ్రీసద్గురుపాదపూజ

19 శుక్ర - చైత్ర పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

29 సోమ - శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

'మహాత్ములు, యోగులు, తాపసోత్తములు అరణ్యాలలో తపస్సు చేసుకుంటూ తమ దేహాన్ని త్యాగం చేస్తున్నారు. వారి దేహం ఏ క్రూర మృగాలకో ఆహారంగా వినియోగ పడటమో లేదా సహజ ప్రక్రియ ద్వారా శిథిలమవడమో జరుగుతోంది. మరికొందరు ఋషులు తమ దేహాన్ని జల సమాధి ద్వారా త్యాగం చేస్తున్నారు. వారి దేహం జలచరాలకి ఆహారం అవుతోంది. అంతేకాదు సాధారణ మానవులు



ఎందరో ఏదో అకస్మాత్తుగా ప్రమాదం జరగటం వలన దేహాన్ని త్యాగం చేయడం జరుగుతోంది. అందులో కొంతమంది భగవంతుని దర్శనార్థం వెడుతూ ప్రమాదానికి గురయి, ప్రాణాలను త్యాగం చేస్తున్నారు. వీరి అందరి మరణానికి వారివారి జన్మ సంస్కారాలకు ఏమైనా సంబంధం వుందా? దేహ త్యాగం చేసిన వారిలో భక్తులు, మహాత్ములు కూడా వున్నారు కదా! వారి సంస్కారానికి ఏమి లోటు వచ్చింది?' అన్న ప్రశ్నకు సమాధానంగా శ్రీగురుదేవులు మాట్లాడుతూ ............

"ఈ విధమైన ప్రశ్న మనందరికోసమే శ్రీరామచంద్రుడు వశిష్ఠుల వారిని అడగటం జరిగింది. దానికి సమాధానంగా వశిష్ఠుల వారు - 'మానవుడు దేహత్యాగం ఎప్పుడు, ఎక్కడ, ఏ విధంగా చేస్తాడో అది మన ఊహకి అందని విషయం. అది కేవలం సృష్టి కర్తకు మాత్రమే ఎరుక!' అన్నారు.

మానవుడు తన ఉపాధి నిర్వహించవలసిన కర్మ రహితమైన మరుక్షణం ఎక్కడ వున్నా, ఏ స్థితిలో వున్నా, ఏ కార్యం నిర్వహిస్తున్నా కూడా దేహాన్ని వదలక తప్పదు సుమా! కాని మహాత్ముల విషయం మాత్రం వేరు. వారు వారి దేహాన్ని స్వచ్ఛందంగా, సునాయాసంగా, ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు త్యజించ గలుగుతారు. వారికి దేహ భావన వుండదు కదా!

మానవుడు దేహ త్యాగం చేసినంత మాత్రాన కర్మ పూర్తిగా

రహితమైనట్లు భావించరాదు. తాను వర్తమానంలో ఆశ్రయించి వున్న ఉపాధి అనుభవించవలసిన కర్మ రహితమైన మరుక్షణం దేహత్యాగం తప్పదు. అయితే సంచితార్థ కర్మ తన వెంట తీసుకువెళ్ళకా తప్పదు. దానిని అనుభవించడానికి వేరొక ఉపాధిని ఆశ్రయించకా తప్పదు. దేహ త్యాగం చేసినంత మాత్రాన జన్మరాహిత్యం సమకూరితే చాలా మంది ఆత్మహత్యకు సిద్ధమయ్యేవారే!

జన్మకు వచ్చిన వారందరూ దేహాన్ని వదలిపెట్ట వలసినదే. అందువలన మానవులందరికీ మరణమంటే భయమే సుమా! ఏ మాత్రం అనారోగ్యానికి గురైనా మరణం సంభవిస్తుందేమోనని భయమే కదా! కానీ మానవుడికి మరణమంటే తీవ్రభయం కలిగినప్పుడే దాని నుండి తప్పించుకునే మార్గాన్ని గురించి అన్వేషణ చేస్తాడు.

జన్మకి వచ్చినవాడు మరణించక తప్పదు కాబట్టి జన్మలేకుండగా చేసుకోవాలి. సద్గురు మూర్తి సమాశ్రయం లభించిన ప్రతి భక్తునికి మరణ భయం వుండదు. అయితే జన్మ లేకుండా చేసుకోవాలి అంటే మోక్షము, లేదా ముక్తిని సిద్ధింపజేసుకోవాలి. సద్గురుమూర్తిని ఆశ్రయించి ఆయనకు సర్వసమర్పణ, లేక సంపూర్ణ శరణాగతి పొందిన సాధకుడెవరైనా జన్మరాహిత్యం సాధించటం తథ్యం!

సర్వసమర్పణ అంటే నీ దేహేంద్రియాదులన్నీ గురుమూర్తి ఆధీనంలో వుంచాలి. జ్ఞానేంద్రియాలు దేనిని ఆస్వాదిస్తున్నా భావనలోగాని, క్రియలోగాని తత్వదృష్టి మరువకూడదు.

మానవుడు ఇంద్రియ నిగ్రహాన్ని సాధించగలడా? సాధించాలనే సంకల్పం జనిస్తుందా? అలా సాధించినవారెవరైనా వున్నారా? ఇంద్రియ సంయమనాన్ని సాధించాలంటే గురుదేవునికి సర్వసమర్పణ చేసుకుని ఆయన అనుగ్రహానికి పాత్రులయిన వారికి మాత్రమే అది సాధ్యం. సద్గురు మూర్తికి సంపూర్ణ శరణాగతి పొందిన సాధకులెవరైనా ఏదైనా కర్మని అనుభవించవలసిన పరిస్థితి కలుగవచ్చు. దానిని అన్యథా భావించరాదు. ఏదైనా కర్మ అనుభవించవలసి వస్తోంది అంటే సద్గురుదేవుల అనుగ్రహానికి పాత్రులై, ఆయన దృష్టిలో పడి, కర్మానుభూతి ద్వారా గమ్యానికి చేరువ అవుతున్నారనే భావన చేసినప్పుడే అది సంపూర్ణ శరణాగతి. అదే ముక్తి మార్గంలో పయనము అంటే" అన్నారు శ్రీబాబు.

# పరిపూర్ణ జ్ఞానం - పాలూరి కాళీప్రసాద్

శ్రీగురుదేవులు బాబూజీ మహరాజ్ పరిపూర్ణ జ్ఞానానికి ప్రతీకగా తరచుగా చంద్రుణ్ణి చెబుతూ వుండేవారు. 'ఎలాగైతే పౌర్ణమికి ఒకరోజు కలిపినా, తీసివేసినా, అది పౌర్ణమి అని అనిపించుకోదో, అలాగే పరిపూర్ణ జ్ఞానానికి ఇక కలపడానికిగానీ, తీసివేయడానికిగానీ ఏమీ వుండదు' అని. అలాగే మనం 'సర్వ విజ్ఞాన తేజమును చంద్రకళగ శిరమునగల మహేశ్వరివి నీవే!' అని అమ్మవారి స్తోత్రంలో చదువుకుంటాం కదా.

ఇంకా శ్రీగురుదేవులు "ఎప్పటికీ ఈ నామాన్నీ, ఈ రూపాన్నీ ప్రేమిస్తూ ఇంతవరకే గురుదేవులు అనుకుంటే లాభం లేదు. కనిపించేవన్నీ ఎప్పటికైనా నశించిపోయేవే. ఈ నామ రూపాలను దాటి సర్వేసర్వత్రా నిండి నిబిడీకృతమైయున్న గురుదేవుల నిర్గుణ సౌందర్యాన్ని అనుభవం లోకి తెచ్చుకోవాలి. అప్పుడే మీ ఆనందం శాశ్వతమవుతుంది" అని కూడా చెప్పేవారు.

మనం ఈ రెండిటినీ కొద్దిగా సమన్వయం చేసి చూద్దాం. చంద్రుడు అనగానే మనకు పరమేశ్వరుడు జ్ఞప్తికి వస్తాడు. ఆయన చంద్రమౌళి కదా! అయితే ఆయనను కేవలం కైలాసవాసిగానో, పార్వతీపతిగానో, ఒక రూపానికి, ఒక నామానికి, ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన వాడిగా చూసినప్పుడు మనకు ఆయన శిరస్సుపై చవితి చంద్రుడు మాత్రమే కనిపిస్తాడు. అంటే అది పరిపూర్ణమైన జ్ఞానం కాదనడానికి ప్రతీక అన్నమాట.

మరి పరిపూర్ణ జ్ఞానానికి ప్రతీక అయిన పూర్ణచంద్రుడు ఎక్కడ వుంటాడో చూద్దాం. 'ఆపాతాళ నభ స్థలాంత భువన బ్రహ్మాండ మావిస్ఫురత్ జ్యోతిస్ఫాటిక లింగ మౌళి విలసత్ పూర్ణేందు వాన్తామృతైః' పాతాళం నుండి ఆకాశం వరకు వున్న అఖిలాండ కోటి బ్రహ్మాండాలన్నీ నిండిపోయి శుద్ధ స్ఫటిక జ్యోతిర్లింగం లాగా పరమేశ్వరుడు ప్రకాశిస్తు న్నప్పుడు ఆయన శిరస్సుపై బ్రహ్మామృత వెన్నెలలు కురిపిస్తూ పూర్ణచంద్రుడు ప్రకాశిస్తున్నాడు - అని పై శ్లోక భాగం చెబుతోంది.

అయితే అలా బ్రహ్మాండ వ్యాప్త దేహుడై పరమేశ్వరుడు వున్నప్పుడు ఇక ఆయనకు శిరస్సు ఎక్కడ? ఆ శిరస్సుపై ప్రకాశించడానికి చంద్రునికి

చోటెక్కడ? అసలు ఇదంతా చూసి వర్ణించే మనమెక్కడ? లోతుగా ఆలోచిస్తే, ఆ చంద్రుడు, ఈ వర్ణించేవాడూ ఇద్దరూ ఆ పరమేశ్వరుని విశ్వరూపంలోనే వున్నారు కానీ వేరుగా లేరు. అంటే జ్ఞానం అనబడే తెలుసుకోవటం, జ్ఞాత అనబడే తెలుసుకునేవాడూ, జ్ఞేయం అనబడే తెలుసుకునే వస్తువైన పరమేశ్వరునిలోనే లీనమైపోయారన్నమాట. అక్కడ వున్నదంతా పరమేశ్వరుడే కానీ, వేరే వస్తువేదీ లేదు. అదే పరిపూర్ణ జ్ఞానం.

శ్రీ గురుదేవులు ఇంకా 'భక్తియొక్క పరాకాష్ఠయే జ్ఞానం' అని చెప్పేవారు. మరి మనం ప్రపంచంలోని భక్తుల పేర్లను స్మరించుకుంటే అందులో మొట్టమొదటగా వచ్చే పేరు ప్రహ్లాదునిది. ఆయన బయటకి ఎంతటి పరమ భక్తుడో లోపల అంతటి జ్ఞాని. గురుదేవుడైన నారదుని నుండి నారాయణ మంత్రం పొందినా ఆయన ఏనాడూ ఆ నారాయణుని రూపాన్ని భౌతికంగా చూడలేదని చెప్పవచ్చు. నారదుని ఆశ్రమంలో నారాయణుని ప్రతిమ వున్నదనుకున్నా ప్రహ్లాదునికి ఊహ తెలిసేలోగానే తండ్రి వచ్చి ఇంటికి తీసుకువెళ్ళిపోవడం జరిగింది. ఇక నారాయణుని బద్ధ శత్రువైన ఆ రాక్షసుని ఇంట్లో గానీ, రాక్షస గురువుల ఆశ్రమంలోగానీ నారాయణుని ప్రతిమ వుండే అవకాశమే లేదుకదా! మరి ప్రహ్లాదుడు ఆరాధించినది సర్వవ్యాపకమైన ఆ నారాయణుని నిర్గుణ తత్వమే కదా! అందుకే ***'ఇందుగలడందు లేడని సందేహము వలదు చక్రి సర్వోపగతుండు'*** అని నిర్భయంగా చెప్పగలిగాడు. అది సాక్షాత్తు అనుభవ జ్ఞానమేగానీ, వాచా జ్ఞానం కాదు.

అయితే 'సగుణం కంటే నిర్గుణం గొప్పదంటావా?' అని మీకిక్కడ సందేహం రావచ్చు. ఇక్కడ మన చర్చ సగుణ నిర్గుణాల గొప్పదనం గురించి కాదు. కేవలం సగుణంతోనే ఆగిపోకుండా భగవంతుడి నిర్గుణ సౌందర్యాన్ని కూడా దర్శించగలగాలి. అప్పుడే జ్ఞానం పరిపూర్ణమవుతుంది అని. తన ఉపాసనా కాలమంతా నారాయణుని ప్రహ్లాదుడు నిర్గుణంగా దర్శించగలిగాడు కాబట్టి నారాయణుడు విచిత్రమైన నరసింహాకృతిలో వచ్చినా కూడా ప్రహ్లాదుడు వెంటనే ఆయనను గుర్తించగలిగాడు.

అదే కేవలం సగుణారాధన మాత్రమే చేసిన ఎందరో భక్తులు, దేవతలు సైతం పరమాత్ముడు వేరే రూపంలో దర్శనమిస్తే గుర్తించలేని

సందర్భాలు మన పురాణాలలో అనేకం కనిపిస్తాయి. అయితే భావనలో ఎప్పుడూ అద్వైత దృష్టి కలిగి వుండాలి కానీ అది క్రియలో పనికిరాదని కూడా పెద్దలు చెబుతారు. 'అద్వైతం త్రిషులోకేషు, నాద్వైతం గురు సన్నిధౌ' - మూడు లోకాలలో ఎక్కడైనా అద్వైత భావన కలిగి వుండు కానీ గురు సన్నిధిలో మాత్రం దాస్యభావనతోనే వుండాలి.

ఒకసారి కొందరు పండితుల సభలో 'సగుణం గొప్పదా? లేక నిర్గుణం గొప్పదా?' అనే ఎడతెగని చర్చ జరుగుతున్నప్పుడు శ్రీగురుదేవులు అక్కడకు వెళ్ళడం తటస్థించింది. తమ సమస్యను తీర్చమని వారు శ్రీగురుదేవులను ప్రార్థించగా వారు 'అసలు సమస్య అంతా మీరు సగుణ నిర్గుణాలను వేరువేరుగా చూడటంలోనే వుంది. ఈ రెండూ పరమాత్మ యొక్క రెండు రకాల విభూతులే కానీ పరస్పరం విభిన్నమైనవి కావు. సగుణ రూపంలో పరమాత్ముని ఆరాధించకపోతే భక్తి కలుగదు. అలాగే నిర్గుణ సౌందర్యాన్ని సర్వేసర్వత్రా దర్శించలేకపోతే జ్ఞానం పరిపూర్ణం కాదు. సగుణ నిర్గుణాలు రెండూ నాణానికి రెండు పార్శ్వాల వంటివి. రెండూ వుంటేనే ఆ నాణానికి విలువ' అని చెప్పి శ్రీగురుదేవులు వారి సందేహ నివృత్తి చేయడం జరిగింది.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**మార్చి 2019**

4 సోమ - మహాశివరాత్రి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

20 బుధ - పౌర్ణమి - హోళీ - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

30 శని - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

**ఏప్రియల్ 2019**

6 శని - శ్రీవికారి నామ సంవత్సర ఉగాది. సా॥ 5-30 గం. శ్రీసద్గురు పాదపూజ.

14 ఆది - శ్రీరామ నవమి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ

19 శుక్ర - చైత్ర పౌర్ణమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

29 సోమ - శ్రీ గురుదశమి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ.

# నేను - తాను

- రమణ ప్రసాద్

(శ్రీ మాతాజీ ప్రసంగాల నుండి)

"ధనుర్మాసంలో శ్రీ గురుదేవులు నిర్ణయించి పెట్టిన ఈ సమయంలో బాబూజీ వారితో 30 ఏళ్ళ క్రిందట పొందిన అనుభవాలను మాటి మాటికీ మననం చేసుకుంటే మనకి ఎంతో తృప్తి, ఆనందాలు కలుగుతున్నాయి. శ్రీబాబూజీ భక్తులను అనుగ్రహించటానికో లేదా ప్రచారానికో వెళ్ళిన సందర్భాలు అనేకం ఉన్నాయి. సర్వాంతర్యామి అయిన శ్రీబాబు తిరిగి వచ్చి, 'నేనెక్కడికో వెళ్ళాననుకున్నారు కదా!' అని ఇక్కడ జరిగిన సన్నివేశాలను పూస గుచ్చినట్లు చెప్తుంటే సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయేవాళ్ళం. అవన్నీ మననం చేసుకుంటుంటే ఇప్పుడు మనం ఎంతో ఆనందానుభూతి పొందుతున్నామా లేదా! అలాగే శ్రీ కృష్ణుడు మధురకు వెళ్ళాక గోపికలందరూ కృష్ణునితో పొందిన అనుభూతులను ఒకరితోఒకరు పంచుకుని ఆనందం పొందలేదూ! అందరు గోపికలు కృష్ణుడు వెళ్ళపోతున్నాడని ఆవేదన చెందుతుంటే, రాధమ్మ అలా అనుకోలేదు. ఇంతలో కృష్ణయ్య అక్కడికి వచ్చి రాధమ్మతో 'మధురకు వెళ్తున్నాను' అన్నాడు. 'ఎవరి అనుమతి తీసుకుని వెళ్తున్నావు?' అంది రాధ. (వారిరువురూ భిన్నం అయితేగా.) 'సృష్టికి వచ్చాక లోకోద్ధరణ కోసం చేసే కార్యాలు నిర్వర్తించటంకోసం వెళ్ళాల్సి వస్తోంది. నువ్వు వద్దంటే బయల్దేరుతానా దేవీ!' అన్నాడు. (ఆమె వద్దు అనదు)."

"శ్రీకృష్ణుడు వెళ్ళిన తర్వాత వారందరూ కృష్ణనామాన్ని చేస్తూ, చేస్తూ జగత్తుని మరిచిపోయారట. ఒకమ్మ 'కృష్ణ! కృష్ణ!' అంటే ఒకామె,'విఠల్! విఠల్!' అన్నదట. మరొకతె 'గోవింద! గోవింద!' అన్నదట. అందరూ కృష్ణయ్య నామం చేస్తూ ఆనందం పొందుతుంటే, కృష్ణయ్య అనుకొన్నాడట, 'నా నామంలో అంత గొప్పతనం ఉందా! ఒకరు ఎగురుతున్నారు. ఒకరు నృత్యం చేస్తున్నారు. ఆ ఆనందం ఎటువంటిదో చూడాలి' అని తాను రాధగా మారాడు. అది ద్వైతమా? ఏకత్వమా?"

"మహాత్ములు మనని తనవారుగా చేసుకొని మాట్లాడుతారు. చూడండి! శ్రీగురుదేవుల వద్ద మన గురు సోదరులు ఎంత సన్నిహితంగా మెలిగారో. ప్రసాదరావుగారు, 'ప్రసాదూ!' అని, పరాశర గారు 'లాల్!' అని శ్రీ గురుదేవులచేత పిలిపించుకోలేదూ!"

"నేను చేస్తున్నాను, నేను చూస్తున్నాను, నేను తింటున్నాను - అది అహంతో కూడిన నేను. అది మన ప్రజ్ఞ అనుకొంటాం. కేనోపనిషత్తు

ఇలా చెబుతోంది:

**శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనోయద్। వాచో హ వాచం స ఉ ప్రాణస్య ప్రాణః।**
**చక్షుషశ్చక్షురతి ముచ్యధీరాః। ప్రేత్యాస్మాల్లోకా దమృతాభవన్తి॥**

'మనస్సు దేనిచేత ప్రేరేపింపబడి తన పనులు చేస్తోంది? దేనిచేత కన్ను, చెవి, మనః ప్రాణాదులు పనిచేస్తున్నాయి? అన్నదానికి సమాధానం - ఆత్మ శక్తి వలననే చెవి వింటుంది, కన్ను చూస్తుంది, మనస్సు గ్రహిస్తుంది, బుద్ధిమంతుడు ఈ ఆత్మను ఇంద్రియ వ్యాపారాలనుండి విడదీసి సాక్షి మాత్రుడై అమరత్వాన్ని పొందుతాడు. ఆ శక్తే గురుశక్తి, లేక ప్రజ్ఞ అని అంటారు'

"మహాత్ములు మనలో 'ఏ నేను'ను చూశారు? మనందరం వారి కృపకు పాత్రులవటానికి కారణం ఒకటా? వేరా?. శ్రీగురుదేవులు అన్నీ 'తానే' అయి మనందరినీ నడిపిస్తున్నారు. "ఒరేయ్! 'నేను' నీకు భిన్నంగా ఉంటే కదా!" అనేవారు. ఆ "నేను" మాధుర్యంతో కూడిన "నేను." "మీ భార్యా భర్తలు రూమ్‌లో మాట్లాడుకుంటున్నారు. నేనక్కడే ఉన్నాను. నాకెలా తెలిసిందనుకుంటున్నారా? మీ ఆయన చెప్పాడులే! కాదు కాదు! మీ ఆవిడ చెప్పిందిలే" అనేవారు. అది వారి సర్వ వ్యాపకత్వానికి తార్కాణం."

ఇక్కడ కృష్ణయ్య రాధమ్మగా మారి ''తనను తాను చూసుకుంటుంటే ఎంత మధురంగా ఉంటుందో?" అనుకొన్నాడు. వున్నది "తానే" అయినప్పుడు, తాను, 'తానే' అయినప్పుడు ఇక నానాత్వానికి తావేదీ!"

కృష్ణుడు మధురకు వెడుతుంటే "గోపికలందరూ రాధమ్మ తల్లితో, "ఏవమ్మా! నువ్వు కూడా వదిలేస్తున్నావా?" అన్నారట. "రాధమ్మ ఎలాగూ వదలిపెట్టదులే" అని వారు భావన చేశారు. "స్వామి కట్టి పెడితే ఉ ండేవాడా?" అందట రాధమ్మ. అక్కడ చాలా బోధ జరిగింది. చివరికి కృష్ణయ్య, "నేనిక్కడ ఉండిపోతాను. నన్ను కట్టెయ్యగలవా?" అన్నాడు. " ప్రభూ! నువ్వు కట్టబడేవాడివా? నిన్ను నేనెలా కట్టగలను? ఒకవేళ కట్టానే అనుకో! దేనిని కడతాను?అంతా నువ్వే అయినప్పుడు!" అని అన్నదట రాధ,"నేను లేకుండా వుండగలవా? నువ్వు వెళ్ళు. వెళ్ళటం నీ బాధ్యత. అయినా నువ్వు నా దగ్గర లేకపోతే కదా!" అందట రాధ. నిజమే! దగ్గర లేకుండా వెళ్ళేవాడు దేవుడెలా అవుతాడు?

మన జీవితాలు భిన్నంగా వుంటే కదా! నువ్వు ద్వంద్వంలో పడితే ఈ అనంతమైన తత్త్వాన్ని ఎలా అనుభవించగలవు?

రాధ 'నన్నొదిలి వెళ్ళలేవు. నువ్వు వెళ్తే నిన్ను నేను ఆపగలనా?' అన్నది. కృష్ణయ్య 'నేను వెళ్తే నువ్వు నాతో ఉండకుండా వున్నావా?' అన్నాడు. (చూడటానికి వేరుగా కనిపించినా ప్రకృతి పరమాత్మకు వేరు కాదు. అదే "జీవబ్రహ్మైక్యాను సంధానం" అంటే. ఎవరైతే మానవలక్షణాలతో వుంటారో వారి మనస్సు ప్రపంచం వైపు తిరిగి ఉంటుంది. ఎవరిలో మాధవ లక్షణాలు ఉన్నాయో, వారి మనస్సు మాధవత్వాన్ని పొందుతుంది.

ఒక భక్తుడు "మీరెవరో తెలుసుకోవాలని ఉంది" అని అడిగితే, "ముందు నీవెవరో తెలుసుకో! అప్పుడు నేనెవరో తెలుస్తుంది. తానెవరో తెలుసుకొని తాను తానై తానుగా ప్రకాశిస్తాడు." అని సెలవిచ్చారు శ్రీ గురుదేవులు. అటువంటి అనంత తత్త్వాన్ని మనకిచ్చి, "తాళాలు మీకిస్తున్నాను. ఇటువైపు త్రిప్పి బంధవిముక్తిని పొందుతారో, లేక అటువైపు (ప్రపంచంవైపు) త్రిప్పి బంధాన్ని తెచ్చుకుంటారో మీ ఇష్టం. మనం అటువంటి బంధవిముక్త స్థితిని ప్రసాదించమని శ్రీ గురుదేవులను ప్రార్థించుకొందాం. కాబట్టి తనను తాను గుర్తిస్తూ మహాత్ములు ఏ త్రోవలో వెళ్ళి చిరస్థాయిగా ప్రకాశిస్తున్నారో, అలాగే మన జీవితాలుకూడా శ్రీ గురుభగవానుని అనుగ్రహంతో పరిపూర్ణంగా ప్రకాశించాలని అటువంటి శక్తిని, భక్తిని శ్రీగురుదేవులు మనందరికీ ప్రసాదించెదరు గాక! సుఖీభవ!!

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా మార్చి 2019, ఏప్రియల్ 2019, మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

మార్చి 2019 : AS 7070, 7451, 7454, 7455, 7457, 7685, 7687, 7689, 7690,
AS 7691, 7694, 7695, 7697, 7698, 7700 నుండి 7705, 7707,
AS 7709, 7711, 7719, 7721, 7722, 7723.

ఏప్రియల్ 2019: AS 4102,4725, 5770, 5919, 6271, 6533, 6856, 6857, 7227,
AS 7458, 7461, 7680, 7732 నుండి 7740,7744, 7747,
AS 7751నుండి7759, 7761నుండి7774

– మేనేజరు

# సమర్థ సద్గురు

(యాజమాన్యం  తదితర వివరాలు)

FORM - 4 ( 8వ నిబంధన ప్రకారము)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం | - శ్రీ కాళీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - సి.వి. రమణబాబు |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - డి.జె.బి.కె. లాల్. |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఛారిటబుల్ ట్రస్ట్ D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరుR.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియచేస్తున్నాము.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి. వి. రమణబాబు

ది. 1-3-2019

(గత సంచిక తరువాయి)

# కైవల్యోపనిషత్

- రేఖ

మొదటి మంత్రంలో చెప్పినట్లు సద్భిః అంటే సత్పురుషుల చేత అనుసరించబడే ఈ బ్రహ్మవిద్య అమృతత్వ స్థితి కేవలం విషయ త్యాగం వల్లనే పొందబడుతుంది. ఈ విషయం మనకి సత్సంగం వలన తెలిసింది. ఈ స్థితి ఎటువంటిది అంటే అది నిజమైన ఆనంద స్థితి.

ఇటువంటి గొప్ప విషయం అనుభవించాలంటే సాధకుడు హృదయగుహలో (హృదయకుహరంలో) అన్వేషించాలి. హృదయ కుహరం బుద్ధికి స్థానం. అక్కడ పరమాత్మ ప్రకాశిస్తూ వుంటాడు. అక్కడ తాను అనబడే బ్రహ్మ ప్రకాశిస్తూ వుంటుంది పరిశుద్ధమైన మనస్సుగల యతీశ్వరులు నిశ్చితార్థులై దానిని అంటే ఆ అమృతత్వ స్థితిని పొంది, విముక్తులై నిరంతరం ప్రకాశిస్తున్నారు. ఈ స్థితి స్వర్గ సుఖాలకు మించిన స్థితి.

శ్రీ మాతాజీ బ్రహ్మవిద్య, స్వర్గసుఖాలు, తత్త్వానుభూతి, యతీశ్వరుల గురించి ఇంకా విపులంగా మాట్లాడుతూ ...

“దేవతలు స్వర్గంలో వున్నారు అంటే దుఃఖం లేకుండా వున్నారు. కానీ సత్యమైన ఆనంద స్థితిలో మాత్రం కాదు. దీనికే భాగవతంలో చెబుతారు ఏమనంటే గోపికలు, గోపబాలురు అందరూ శ్రీకృష్ణుడి చుట్టూ చేరి, చల్దులు భుక్తశేషాన్ని ఆరగిస్తుంటే దేవతలు పైనుండి చూసి ఈర్ష్యపడ్డారట. ఎందుకంటే వారు అమృతపానం చేసి సుఖాలు అనుభవిస్తున్నారు. గోకులంలో వారందరిలాగ ఆ పరబ్రహ్మతో ఆడుకుని, ఆనందాన్ని మేము పొందలేకపోయామే! అని.

మనం కూడా ఇక్కడ బ్రహ్మవిద్యను అనుభవిస్తున్నాము. ఏ భేద భావన లేకుండా మన వినికిడిలో, విచారణలో; మనం పొందే అనుభవంలోనూ; గోకులంలో వారు పొందిన ఆనందంలోనూ తారతమ్యం లేదు. ఇక్కడ మహాప్రసాదం లభిస్తోంది. అమృతం అంటే ఇదే” అన్నారు.

బ్రహ్మవిద్య విషయంలో, వేదాంత విజ్ఞాన విషయంలో నిశ్చితమైన అర్థాన్ని తెలుసుకున్నవారు యతీశ్వరులు. వారు పరిశుద్ధమైన

అంతఃకరణ కలవారై సన్న్యాస యోగము ద్వారా ఆ స్థితిని పొందారు. మాతాజీ సన్న్యాస దీక్ష తీసుకోవడానికి అందరూ సిద్ధంగా వున్నారా? అని అక్కడ వున్న సాధకులని ప్రశ్నించి, మళ్ళీ వారే సమాధానం చెబుతూ, 'సన్న్యాసం అంటే మనస్సు సన్న్యసించటం' అన్నారు. తాత్కాలికంగా ఇప్పుడు మనసుని సన్న్యసించి ఇక్కడ బ్రహ్మవిద్యను నేర్చుకుంటున్నాము. అది శాశ్వతం (Permanent) అయిపోవాలి. అంటే విషయాదుల యందు వుండే ఆసక్తిగల మనస్సు నిరంతరము ఆత్మవస్తువు నందు నిలిచిపోవడమే, తాదాత్మ్యం చెందడమే సన్న్యాస యోగము. (సంయక్ న్యాసం - సన్న్యాసము).

యతీశ్వరులు నిరంతరం బ్రహ్మానుభూతిని పొందే పరబ్రహ్మ స్వరూపులు. వారికి కాలంతో, యుగాలతో మార్పు చెందరు. బ్రహ్మప్రళయ కాలం అనేది సృష్టికి వుంది. కానీ యతీశ్వరులలకు లేదు. వారికి ఈ దేహం మీద దృష్టి వుండదు. బ్రహ్మ ప్రళయ కాలంలో కూడా వారు పరబ్రహ్మము నందు లీనమైపోయి వుంటారు. నిరంతరం ఆ తత్వంలో వారు రమిస్తూ వుంటారు. అమృతత్వ స్థితిని, ముక్తిని పొంది వున్నవారే యతీశ్వరులు.

మనం కూడా ఇటువంటి తత్వాన్ని, పరబ్రహ్మ విషయాన్ని ఆచరించుకోవాలనుకుంటున్నాము కాబట్టి మన దృష్టి నిరంతరం వేదాంత విషయాలలో సునిశ్చితమై వుండాలి. ఏదో ఈవాళ్టికి చెప్పేసుకున్నాం అని పుస్తకం మూసేసి వెళ్ళిపోవడం కాదు. పుస్తకం మూసివేసినా, మనం మస్తకంలో మాత్రం నిరంతరం ధారణ చేయాలి.

శ్రద్ధ, భక్తి, ధ్యాన యోగాల ద్వారా వారు ఎలా అయితే జ్ఞాన దృష్టిని సంపాదించారో, అదే విధంగా మనం ఎవరైతే ఈ మూడు యోగాలు నిరంతరం ధారణ చేస్తూ ఆ పరబ్రహ్మతత్వంలో నిరంతరం రమిస్తూ వుంటామో, నిత్యసత్యాన్ని గుర్తిస్తూ వుంటాము.

-సశేషం

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## బళ్ళారి శాస్త్రిగారితో శ్రీబాబు

- విజయేశ్వరానంద ప్రసాద్

అప్పటికి టైము ఆరు గంటలైంది. శాస్త్రిగారు బయటకు వచ్చేసరికి, శ్రీబాబు గోపాల్‌ను పిలిచి "నువ్వు కారులో శాస్త్రిగారిని గుంటూరు తీసుకుని వెళ్ళి, రైలెక్కించి రమ్మన్నారు. గుంటూరు స్టేషన్ వద్ద దిగి ప్లాట్ ఫారమ్ మీదకు వచ్చేసరికి, బండి రెండున్నర గంటలు లేటుగా వచ్చి, అప్పుడే కదలబోతున్నది. శాస్త్రిగారు టికెట్టు తీసుకోకుండానే రైలెక్కి రైల్లోనే టికెట్టు తీసుకున్నారు.



"దేశ కాలాతీతులైన శ్రీబాబు నిర్ణయించిన ప్రకారం, ఆయన ఆజ్ఞకు లోబడి దేశ కాలములు నడుచుకోవలపినదే గాని, వాటికి ఆయన లోబడే వారు కాదు" అని శాస్త్రిగారు తమ డైరీలో వ్రాసుకున్నారు.

1965లో శాస్త్రిగారు సకుటుంబంగా శ్రీబాబుతో కాశీ యాత్రకు వెళ్ళటానికి ఏర్పాట్లు చేసుకున్నారు. కాని చివరి నిమిషంలో ఆ యాత్ర రద్దయి పోయింది. కొందరు భక్తులతో శ్రీబాబు భువనేశ్వర్ వరకు వెళ్ళి తిరిగి వచ్చేశారు. నిరుత్సాహం పొందిన శాస్త్రిగారు మాత్రం భద్రాచలం వరకు వెళ్ళి తిరిగి వచ్చేశారు.

1966లో చాలా మంది భక్తులతో కలిసి శ్రీబాబు ఉత్తర దేశ యాత్రకు నిర్ణయించారు. శ్రీబాబు శాస్త్రిగారితో "అన్నగారూ! మునుపు మిమ్మల్ని కాశీ తీసుకు వెడతానని అన్ని ఏర్పాట్లూ చేసి, తీసుకుని వెళ్ళలేక పోయాను. ఈసారి మొత్తం ఉత్తర దేశ యాత్రకు ఏర్పాట్లు చేయిస్తున్నాను. మిమ్మల్ని, అమ్మమ్మగారిని, వదినగారిని యీ యాత్రకు తీసుకుని వెళ్ళి, అన్ని క్షేత్రాలు చూపించాలనుకున్నాను. ప్రయాణానికి సిద్ధంకండి" అన్నారు.

అప్పుడు శాస్త్రిగారొక్కరే గుంటూరులో శ్రీబాబుతో ఉన్నారు. శాస్త్రిగారు "ఇంట్లో యిబ్బందుల వలన మా అమ్మగారు, నా భార్య కూడ

రాలేని పరిస్థితిలో ఉన్నారు. నాకు రావాలని లేదు" అన్నారు. శ్రీబాబు "వాళ్ళు రాలేకపోయినా మీరైనా రాక తప్పదు" అన్నారు. శాస్త్రిగారు "బాబూ! యాత్రకు సరిపడ బట్టలూ లేవు, చాలినంత డబ్బూ లేదు. పైగా నా తల్లిగారిని, ధర్మపత్నిని తీసుకొని వెళ్ళకుండా నేనొక్కడిని యాత్ర చెయ్యటం న్యాయం కాదనిపిస్తున్నది" అన్నారు. శ్రీ బాబు "డబ్బు విషయమూ, బట్టల విషయమూ నేను చూసుకుంటాను. ఇక న్యాయాన్యాయములు, పుణ్య పాపములు అంటారా? నా చేత జగన్మాత ఎవరికీ అన్యాయం జరుగనివ్వదు. ఎప్పుడు ఎవరికి ఏది జరిగినా, అది అమ్మ ఆజ్ఞప్రకారమే జరుగుతుంది; కనుక అది న్యాయమే అవుతుంది. ఆ న్యాయాన్యాయ సమస్యను నాకు వదలి మీరు ప్రయాణమవండి" అన్నారు. శాస్త్రిగారు" నా మనస్సు అంగీకరించటం లేదు. క్షమించండి" అన్నారు.

ఆ తరువాత ఏం జరిగిందో శాస్త్రిగారే యిలా వ్రాసుకున్నారు. "నేను రాను గాక రానన్నాను. శ్రీ బాబు సామ, దాన, భేదోపాయములు ఉపయోగించి చూశారు. ప్రయోజనం లేకపోయింది. అప్పుడు శ్రీబాబు యిద్దరు యువ భక్తులను పిలిచి, నన్ను పట్టుకుని రిక్షాలో ఎక్కించి, స్టేషనుకు పంపారు. నేను వెళ్ళేసరికి రైలు వెళ్ళిపోయింది. 'హమ్మయ్య! మంచి పని జరిగింది. ఇక నేను బళ్ళారి తిరిగి వెళ్ళిపోవచ్చును' అనుకుంటూ నేను తిరిగి వస్తుంటే, శ్రీబాబు కారులో వస్తూ ఎదురైనారు. వెంటనే కారు ఆపి, మళ్ళీ నన్ను బలవంతంగా తమ కారులో ఎక్కించి కూర్చోబెట్టుకుని బెజవాడ తీసుకుని వెళ్ళి స్వయంగా యాత్ర బండిలో ఎక్కించారు. ఆ విధంగా, రానని నేను మొండి పట్టు పడితే నా కంటె మొండి పట్టు పట్టి, నన్ను వెంటబెట్టి తీసుకుని వెళ్ళి నాతో ఉత్తర యాత్ర చేయించారు.

-సశేషం

*భగవంతుడు మధుర స్వరూపుడు. పంచదార చిలుకను ఎటునుండి కొరికినా తీపియే. అట్లే భగవానుని పాదములు, అధరము, హృదయము, నయనము అన్నీ మధురమే. అసలు తానే మధుర స్వరూపుడు.*

-శ్రీ బాబూజీ మహరాజ్

## శ్రీబాబూజీ స్కూల్ విశేషాలు

# Scholastic Exhibition

16-2-2019 శనివారం నాడు 9గం.ల నుండి 5గం.ల వరకు ఆశ్రమం శ్రీబాబూజీ పాఠశాలలో స్కాలస్టిక్ ఎగ్జిబిషన్ జరిగినది. ఈ ప్రదర్శనలో యు.కెజి నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు భౌతిక శాస్త్రము, రసాయన శాస్త్రము, వృక్ష శాస్త్రము, జీవ శాస్త్రముల పాఠ్యాంశములకు సంబంధించి 101 ప్రాజెక్టులు, గణిత శాస్త్రము సంబంధించి 23, తెలుగు భాషలో 15, హిందీ 13, ఇంగ్లీషులో 16, సాంఘిక శాస్త్రము సంబంధించి 6, జనరల్ నాలెడ్జ్ 3 కలిపి మొత్తం 179 ప్రాజెక్టులు తయారు చేశారు. ఈ ఎగ్జిబిషన్ ఉదయం 9గం.లకు ముఖ్యఅతిథి శ్రీ పోపూరి రామకృష్ణ ఐ.పి.ఎస్, డిప్యూటి ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వారిచే ప్రారంభించబడినది.

దాదాపు పిల్లల యొక్క తల్లిదండ్రులు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. కొంతమంది ఈ ఎగ్జిబిషన్ గురించి మాట్లాడుతూ క్లాస్‌రూమ్‌లో చదివిన విద్యను ప్రాజెక్ట్‌ల రూపంలో విద్యార్థులు తయారు చేయటం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, ఈ ఎగ్జిబిషన్ విద్యార్థుల యొక్క విజ్ఞానాభివృద్ధి మరియు వ్యక్తిత్వ వికాస అభివృద్ధికి తోడ్పడుతుందని ప్రస్తావించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల పూర్వ విద్యార్థులు శ్రీకృష్ణచైతన్య, వాణి స్పాన్సర్ చేశారు.







## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ పరమ భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన వట్టెం రామసుబ్రహ్మణ్యం గారు (మధురై బ్యాంక్) 25-1-2019 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 65 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రీ స్వామి వివేకానంద

"ఒకరోజు శ్రీ రామకృష్ణుల ప్రార్ధనను భగవంతుడు మన్నిస్తాడన్న భావన నా మనస్సులో మెదిలింది. నా కనీస ఆర్ధిక అవసరాలను తీర్చే మార్గం చూపించమని జగజ్జననిని ప్రార్ధించమని ఆయనను ఎందుకు ప్రాధేయపడకూడదు? నా కోసం ఆ సహాయం చేయటానికి ఆయన ఎన్నడూ వెనుకాడరు అని నేను నా కుటుంబం తరఫున జగజ్జననిని ప్రార్ధించమని పట్టుపట్టాను.



ఆయన 'నాయనా! నేను అలా కోరగలనా? నువ్వే ఎందుకు ప్రార్ధించరాదు? కాళీమాతను అంగీకరించనందువలననే నీకు ఇన్ని బాధలు.' అన్నారు 'నాకు ఆమె తెలియదు నా కోసం మీరే విన్నవించండి, విన్నవించేతీరాలి" అన్నాను. "నేను పలుమార్లు ఆమెను ప్రార్ధించాను నువ్వు ఆమెను అంగీకరించనందువలన నా ప్రార్ధనలను ఆమె మన్నించటంలేదు. పోనీలే ఈ రోజు మంగళవారం. రాత్రి కాళికాలయానికి వెళ్ళి సాష్టాంగ పడి నీకు కావలసిన వరం కోరుకో. తప్పక ఆమె అనుగ్రహిస్తుంది. నాతల్లి జ్ఞాన స్వరూపిణి. బ్రహ్మశక్తి, సంకల్ప మాత్రం చేతనే లోకాన్ని సృజించింది. అంతా ఆమె అధికారం లోనే ఉంది." అన్నారు.

"ప్రగాఢమైన విశ్వాసంతో రాత్రి కోసం నిరీక్షించాను. ఆలయానికి వెళ్తుండగానే ఒక దివ్యోన్మత్తత నన్ను ఆవహించింది. కాళ్ళు తడబడ్డాయి. జగన్మాతను నిజంగానే దర్శించబోతున్నాను. ఆమె పలుకులు వినబోతున్నాను. అనే ఆనందంతో నాగుండె ఉరకలు వేసింది. ఆలయంలో అడుగు పెట్టి దేవి విగ్రహం మీద దృష్టి నిలిపాను. మూర్తీభవించిన ప్రేమ స్వరూపిణిగా, సాటిలేని

సౌందర్యమూర్తిగా, సజీవచైతన్యమూర్తిగా ఆమె దర్శనమిచ్చింది. భక్తి ప్రేమలతో నా హృదయం పొంగిపోయింది. నేను పదేపదే ప్రణమిల్లి "తల్లీ నాకు వివేచన ప్రసాదించు. పరిత్యాగం అనుగ్రహించు. వైరాగ్యం అనుగ్రహించు! భక్తి జ్ఞానాలను ప్రసాదించు! సర్వవేళలా నీదర్శన భాగ్యం కలిగించు!" అని ప్రార్థించాను. మనస్సు ప్రశాంతతను పొందింది. లోకం పూర్తిగా మటుమాయమైంది. కాళీమాత మాత్రమే నాహృదయంలో నిలిచింది.

నేను బయటకు రాగానే 'నీ దారిద్ర్యం అంతరించాలని జగజ్జననిని వేడుకున్నావు కదా!' అని ప్రశ్నించారు. నేనే దిగ్భ్రాంతి చెందాను. "లేదు మహాశయా! దాని గురించి పూర్తిగా మరిచిపోయాను. అందుకు ప్రత్యుపాయం ఏదైనా ఉందా?" అని అడిగాను.

'మళ్ళీ వెళ్ళు! నీకోరికను విన్నవించు' అని చెప్పారు. కాని కాళీమాత సాన్నిధ్యం లోకి వెళ్ళగానే అంతా మరిచిపోయాను పదే పదే భక్తి, జ్ఞానాలను అనుగ్రహించమని మాత్రమే ప్రార్థించాను. 'ఈ సారి నీ ప్రయత్నం ఫలించిందా?' అని ప్రశ్నించారు. ఏం జరిగిందో చెప్పాను. 'ఎంత అప్రయోజకత్వం! నిన్ను నువ్వు అదుపులో ఉంచుకొని ఆనాలుగు మాటలూ చెప్పలేక పోయావా సరే! ఈసారి ప్రయత్నించి ప్రార్థించు.' అన్నారు. మూడవసారి వెళ్ళాను. ఆలయంలోకి వెళ్ళగానే ఎంత అల్పమైన కోరికను కోరటానికి జగజ్జననిని ప్రార్థించటానికి వచ్చాను? నేనెంత మూర్ఖుడిని? సిగ్గుతో, పశ్చాత్తాపంతో ఆమె ముందు మోకరిల్లి 'తల్లీ! నాకు మరేదీ వద్దు విశుద్ధభక్తి, జ్ఞానాలు మాత్రం ప్రసాదించు" అని ప్రార్థించాను.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL